

కాణిపాకం ఈవో నియామకంపై పునరాలోచన?



గురుప్రసాద్ - పెంచల కిషోర్

ఐరాల(కాణిపాకం), డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయ ఈవో నియామకంపై రాష్ట్ర ప్రభుత్వం పునరాలోచనలో పడినట్లు విశ్వసనీయ సమాచారం. ప్రస్తుతం ఆలయ ఈవోగా పనిచేస్తున్న గురుప్రసాద్ ఆగస్టు 31న ఆలయ ఈవోగా బాధ్యతలు తీసుకున్నారు. ఆయనకు ముందు ఎఫ్ఏసీగా వాణి పనిచేశారు. ఆమెకు ముందు ఆలయ ఈవోగా వెంకటేశు బాధ్యతలు నిర్వహించారు. ఈ సమయంలో ఆలయంలో జరిగిన అనేక పరిణామాలు వివాదాస్పదం అయ్యాయి. ఈ తరుణంలో టీడీపీ కూటమి ప్రభుత్వం గద్దెనెక్కిన అనంతరం రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి లోకేష్ వరసిద్ధుడి ఆలయంపై దృష్టి సారించారు. ఈవో వెంకటేశును మాతృశాఖ అయిన రెవెన్యూకు బదిలీ చేస్తూ.. జీడీఏలో రిపోర్టు చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. గురుప్రసాద్ ఈవోగా బాధ్యతులు తీసుకున్న వెంటనే ఆలయంలో బ్రహ్మోత్సవాలు నిర్వహించారు. హఠాత్తుగా ఈయనను బదిలీ చేసి.. ఈవోగా పెంచల కిషోర్‌ను నియమించారు. మూడు నెలల్లోనే ముగ్గురు ఈవోలను బదిలీ చేయడం కాణిపాకంలో చర్చనీయాంశంగా మారింది. ఈవోగా పెంచల కిషోర్‌ను నియమించడంపై కాణిపాకం టీడీపీ నాయకులు ముఖ్యమంత్రికి లేఖలు రాసినట్లు సమాచారం. డిప్యూటీ కలెక్టర్ పెంచలకిషోర్.. వైసీపీ వారికి అనుకూలంగా గతంలో వ్యవహరించారని వారు పేర్కొన్నారు. ఈ అంశాలను మంత్రులు లోకేష్, ఆనం నారాయణరెడ్డి దృష్టికి కొందరు నాయకులు తీసుకెళ్లినట్లు తెలిసింది. దీంతో రాష్ట్ర ప్రభుత్వం కాణిపాక ఆలయ ఈవో బదిలీపై పునరాలోచనలో పడినట్లు ప్రచారం జరుగుతోంది.

పుంగనూరులో కిలో టమోటా రూ.66.70

పుంగనూరు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు వ్యవసాయ మార్కెట్ యార్డులో సోమవారం నాణ్యత గల మొదటిరకం టమోటా కిలో రూ.66.70 ధర పలికింది. మొదటి రకం కిలో రూ.66.70, రెండో రకం రూ.61.40, మూడోరకం రూ.56.70 చొప్పున విక్రయాలు జరిగాయి. తుపాను ప్రభావంతో మూడ్రోజులుగా కురుస్తున్న వర్షాలకు టమోటా పంట దెబ్బతినడంతో తక్కువ సంఖ్యలో కాయలు రావడంతో ధరలు పెరిగాయి.

1446 ఎకరాల్లో పంట నష్టం

ఇంకా పెరిగే అవకాశం ఉందని అధికారుల అంచనా

● ఆరు పశువుల మృతి ● కురుస్తూనే ఉన్న వర్షం



బంగారుపాళ్యం మండలంలో వరికుప్పల్లోకి చేరిన వర్షపునీరు

చిత్తూరు కలెక్టరేట్ / చిత్తూరు సెంట్రల్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఫెంగల్ తుఫాన్ ప్రభావంతో సోమవారం కూడా వర్షం కురుస్తూనే ఉంది. ప్రభుత్వ ఆదేశాలతో జిల్లా యంత్రాంగం ఎప్పటికప్పుడు పరిస్థితులను అంచనా వేస్తూనే ఉంది. జిల్లా, డివిజన్, మండల కేంద్రాల్లో ఏర్పాటు చేసిన కంట్రోల్‌రూమ్‌లు యథావిధిగా పనిచేస్తున్నాయి. ఆదివారం పెనుమూరు మండలంలోని ఎన్టీఆర్ జలాశయం గేట్లను ఎత్తేయగా.. సోమవారం కార్వేటినగరం మండలంలోని కృష్ణాపురం జలాశయం ఓ గేటు ఎత్తి నీళ్లను కిందికి వదిలారు. జిల్లాలోని అన్ని చెరువుల్లోనూ నీటి మట్టం పెరిగింది.



చౌడేపల్లె మండలంలోని దిగువపల్లెలో దెబ్బతిన్న టమోట పంట

పంట నష్టమిలా..

జిల్లాలో 1446 ఎకరాల్లో సాధారణ, ఉద్యాన పంటలు దెబ్బతిన్నాయి. 85 గ్రామాల్లో 810 మంది రైతులు 1199 ఎకరాల్లో సాగు చేసిన వరి దెబ్బతినగా, 18 గ్రామాల్లో 182 మంది రైతులు 247 ఎకరాల్లో సాగుచేసిన టమోటా, ఉద్యాన పంటలు దెబ్బతిన్నాయి. అత్యధికంగా సోమల మండలంలోని 13 గ్రామాల్లో 327 మంది రైతులు 560 ఎకరాల్లోని వరిసాగు దెబ్బతింది. పుంగనూరు మండలంలోని 14 గ్రామాల్లో 215 మంది రైతులు 260 ఎకరాల్లో వరి పంట నీటి మునిగింది. 75 ఎకరాల్లో ఉల్ల సాగు, వి.కోట, బైరెడ్డిపల్లె మండలాల్లో 20 గ్రామాల్లో 132 మంది రైతులు 184.5 ఎకరాల్లో సాగు చేసిన ఉల్ల, వంకాయ, కాకరకాయ తదితర పంటలు దెబ్బతిన్నాయి. జిల్లా వ్యవసాయ, ఉద్యాన శాఖ అధికారులు పంటలను పరిశీలించి నష్టం వివరాలను నమోదు చేశారు. ప్రాథమిక సమాచారం మేరకు దెబ్బతిన్న పంట తీవ్రత మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు.

పశు నష్టమిలా..

పెద్దపంజాణి మండలంలో ఓ రైతుకు చెందిన రెండు పాడి ఆవులు, రెండు దూడలు, చౌడేపల్లెలో ఒక ఆవు, రామసముద్రంలో ఒక గొర్రె మృతి చెందాయి. గంగాధరనెల్లూరు మండలంలోని ఓ గుడిసె పాక్షికంగా దెబ్బతింది.



సోమల మండలంలో దెబ్బతిన్న వరిని పరిశీలిస్తున్న పుంగనూరు ఏడీఏ శివకుమార్

ఒక్కరోజులోనే ఈనెల సాధారణ వర్షపాతం నమోదు

డిసెంబరు నెల జిల్లా సాధారణ వర్షపాతం 54.8 మి.మీ కాగా, ఆదివారం ఒక్కరోజే సాధరణానికి మించి 57.4 మి.మీ వర్షపాతం నమోదైంది. నవంబరు నెల జిల్లా సాధారణ వర్షపాతం 141.8 మి.మీ కాగా, శనివారం వరకు 68.3 లోటుతో 44.9 మి.మీ మాత్రమే కురిసింది. ఆదివారం ఉదయం ఎనిమిది నుంచి సోమవారం ఉదయం ఎనిమిది గంటల వరకు జిల్లావ్యాప్తంగా 33.7 మి.మీ సగటు వర్షపాతం నమోదయ్యింది. చిత్తూరులో అత్యధికంగా 63.0 మి.మీ, నగరిలో అత్యల్పంగా 14.2 మి.మీ వర్షం కురిసింది. మండలాలవారీగా.. సోమలలో 55.8, రామకుప్పంలో 46.4, చౌడేపల్లెలో 45, గుడిపాలలో 43.8, యాదమరిలో 42.6, శ్రీరంగరాజపురంలో 41.6, కార్వేటినగరంలో 41.4, చిత్తూరు రూరల్‌లో 39.4, శాంతిపురంలో 39.2, గంగవరంలో 37.8, వి.కోటలో 37.4, పలమనేరులో 35.8, బైరెడ్డిపల్లెలో 34.6, గంగాధరనెల్లూరులో 33.6, కుప్పంలో 33, సదుంలో 32.6, పెనుమూరులో 32.4, గుడుపల్లెలో 28.8, బంగారుపాళ్యంలో 28.6, పాలసముద్రంలో 28.2, పూతలపట్టులో 26.6, తవణంపల్లెలో 26.2, పెద్దపంజాణిలో 26, పుంగనూరులో 25.6, ఐరాలలో 25, నింద్రలో 24.6, పులిచెర్లలో 24, రొంపిచెర్లలో 22.8, వెదురుకుప్పంలో 22, విజయపురంలో 21.4 మి.మీ వర్షం కురిసింది.

● తుఫాన్ ఎఫెక్ట్

భక్తుల్లేక బోసిపోయిన కాణిపాకం

ఐరాల(కాణిపాకం), డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): తుఫాను కారణంగా భక్తుల రాక తగ్గడంతో ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాణిపాకం సోమవారం బోసిపోయింది. మూడ్రోజులుగా ముసురు కారణంగా ఆదివారం వరకు వరసిద్ధుడి ఆలయానికి భక్తులు తరలివచ్చారు. ప్రస్తుతం ఆలయ పరిసర ప్రాంతాల నుంచి మాత్రమే స్వామి దర్శనార్థం వస్తుండటంతో వీధులన్నీ ఖాళీగా కనిపిస్తున్నాయి. సాధారణ రోజుల్లో ఆలయానికి సుమారు 20 వేలకు తగ్గకుండా వస్తారు. ప్రత్యేకమైన రోజుల్లో అయితే 30-50వేల మంది వరకు స్వామిని దర్శించుకుంటారు.



ఖాళీగా ఉన్న కాణిపాకం రోడ్డు



కృష్ణాపురం జలాశయం నుంచి కిందకు విడుదలైన నీరు



ఐరాల మండలం పాలకల-2 సచివాలయం పరిధిలో జరుగుతున్న ఎంఎస్ఎంఈ సర్వే

పరిశ్రమల్ని ప్రోత్సహించేలా అడుగులు

జిల్లాలో ప్రారంభమైన ఎంఎస్ఎంఈ సర్వే

వివరాలిలా..

- ఉద్యమ్ పోర్టల్‌లో రిజిస్ట్రేషన్స్ అయినవి: 34,700
- పవర్ కనెక్షన్స్ ఉన్నవి: 67,296
- ఎంఎస్ఎంఈ మానుఫ్యాక్చరింగ్ యూనిట్లు: 903
- రెండ్రోజుల్లోనే సర్వే చేసిన యూనిట్లు: 316

గత ప్రభుత్వం పారిశ్రామిక అభివృద్ధిని పట్టించుకోని విషయం తెలిసిందే. జిల్లాకు వచ్చిన పరిశ్రమలు కూడా వైసీపీ అధికారంలోకి రాగానే రద్దు చేసుకుని వెళ్లిపోయాయి. చంద్రబాబు ఎప్పుడు సీఎం అయినా పరిశ్రమల్ని ప్రోత్సహించేందుకు తీవ్రంగా కృషి చేస్తుంటారు. 2014-19 మధ్యలో కూడా ఉమ్మడి జిల్లాలోని శ్రీకాళహస్తి, రేణిగుంట, ఏర్పేడు ప్రాంతాల్లో భారీ పరిశ్రమల్ని నెలకొల్పారు. కుప్పం, పలమనేరు, పుంగనూరు, జీడీనెల్లూరు ప్రాంతాల్లో ఎంఎస్ఎంఈ (సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు) పార్కుల్ని అభివృద్ధి చేశారు. ఇప్పుడు కూటమి అధికారంలో వచ్చాక కేంద్ర ప్రభుత్వ సహకారంతో పరిశ్రమల అభివృద్ధిపై దృష్టి సారించింది. ఎంఎస్ఎంఈలను ప్రోత్సహించేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించింది.

- చిత్తూరు, ఆంధ్రజ్యోతి

సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల్ని మెరుగు పరిచేందుకు ప్రపంచ బ్యాంకు ఆర్థిక సాయంతో కేంద్ర ప్రభుత్వం ర్యాంప్ అనే స్కీమ్‌ను ప్రకటించింది. ఇందులో ఓ భాగమైన ఎంఎస్ఎంఈ ఫార్మలైజేషన్‌లో భాగంగా రాష్ట్రంలో అన్ని ఎంఎస్ఎంఈల సర్వే చేస్తున్నారు. ఈ క్రమంలో మన జిల్లాలో కూడా గత శుక్రవారం నుంచి సర్వే ప్రారంభమైంది. ఎంఎస్ఎంఈ సర్వే అండ్ సపోర్ట్ అనే మొబైల్ యాప్‌లో సచివాలయ సిబ్బంది క్షేత్రస్థాయిలో వివరాలు సేకరిస్తున్నారు. నవంబరు 29న ప్రారంభమైన ఈ సర్వే ఫిబ్రవరి ఒకటో తేదీవరకు కొనసాగుతుంది. తయారీ, సేవ, వాణిజ్య రంగాల్లోని అన్ని ఎంఎస్ఎంఈ యూనిట్లను సర్వే చేసి.. వాటిని డిజిటల్ ప్లాట్‌ఫాంలోకి తీసుకొచ్చి 'ఏపీ.ఎంఎస్ఎంఈ.వన్' అనే పోర్టల్‌లో ఉంచుతారు. అలాగే నమోదుకాని వ్యాపారాలను ఉద్యమ్, ఉద్యమ్ అసిస్ట్‌లలో నమోదు చేస్తారు.

సర్వేలో గుర్తిస్తే ఉపయోగాలెన్నో..

పరిశ్రమల ఏర్పాటుకు ముందుకు వచ్చేవారికి ఎన్‌డీఏ ప్రభుత్వం 88 రకాల రాయితీలు అందిస్తోంది. సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల ఏర్పాటుకు అవకాశాలున్నా చాలా మంది అందుకోలేకపోతున్నారు. ఈ విషయాన్ని కేంద్రం దృష్టికి రాష్ట్ర ప్రభుత్వం తీసుకెళ్లడంతో ఎంఎస్ఎంఈ సర్వేకు ఆదేశాలు జారీ చేసింది. సర్వే పూర్తయిన వారికి ఉద్యమ్ గుర్తింపు సంఖ్య వస్తుంది. ఈ రిజిస్ట్రేషన్ పత్రం వస్తే బ్యాంకు రుణాల మంజూరు ప్రక్రియ వేగవంతం అవుతుంది. రాయితీలు, సౌకర్యాలు పొందేందుకు అర్హత లభిస్తుంది. కేంద్రం రాయితీలు, మార్కెటింగ్, ఈ- కామర్స్ ద్వారా వ్యాపారాలు విస్తరించుకునే వెసులుబాటు కలుగుతుంది. ఓపెన్ నెట్‌వర్క్ డిజిటల్ ప్లాట్‌ఫామ్ (ఓఎన్‌డీపీ) సహకారం అందిస్తారు. ఎంఎస్ఎంఈలు తాము ఉత్పత్తి చేసిన ఉత్పత్తులకు మార్కెటింగ్ సౌకర్యం కల్పించేందుకు మల్టీనేషనల్ కంపెనీలతో అనుసంధానం చేస్తారు.

రెండ్రోజుల్లోనే 316 యూనిట్ల గుర్తింపు

పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో తోపుడు బండ్లు, మొబైల్ క్యాంటీన్ల ద్వారా వ్యాపారాలు చేసుకునేవారితోపాటు సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలన్నింటినీ సర్వే చేయనున్నారు. ఈ బాధ్యతను గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులకు అప్పగించారు. శుక్ర, శనివారాలు చేసిన సర్వేలో అత్యధికంగా పలమనేరులో 79, పుంగనూరులో 65, శాంతిపురంలో 53 ఎంఎస్ఎంఈ యూనిట్లను గుర్తించారు. జిల్లావ్యాప్తంగా 316 యూనిట్ల వివరాలను నమోదు చేశారు.

ఎలాంటి పూచీకత్తు లేకుండా రుణాలు

ఈ సర్వేలో నమోదైన పరిశ్రమలకు కేంద్ర ప్రభుత్వం క్రెడిట్ గ్యారెంటీ ట్రస్టు ద్వారా ఎలాంటి పూచీకత్తు లేకుండా రూ.కోటి పైబడి రుణాలు అందుతాయి. అలాగే ప్రధానమంత్రి ఉపాధి కల్పన పథకం (పీఎంఈజీపీ) ద్వారా ఎస్సీ, ఎస్టీ, బీసీలకు రాయితీ ఇస్తుండగా.. ప్రస్తుతం ఓసీలకు రాయితీ ఇవ్వనున్నారు. పట్టణ ప్రాంతాల్లో 15, గ్రామీణ ప్రాంతాల్లో 25 శాతం రాయితీ అందించనుంది. స్టాండప్ ఇండియా, స్టార్టప్ ఇండియా, ముద్ర రుణాలు రూ.5-10 లక్షల వరకు ఇవ్వనున్నారు.

రాయితీలకు ఇదే ప్రామాణికం



సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల్ని గుర్తించేందుకు సర్వే మొదలుపెట్టాం. మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోల పర్యవేక్షణలో సచివాలయ సిబ్బంది సర్వే చేస్తున్నారు. ఏనీ ఇమ్మూవబుల్ ఎకనమిక్ యూనిట్లను సర్వే చేయవచ్చు. సర్వేలో గుర్తించబడి పొందిన ఉద్యమ్ ధ్రువీకరణ పత్రాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే రాయితీలు, పథకాల్లో ప్రామాణికంగా తీసుకుంటారు.

- శ్రీనివాస్‌యాదవ్, జీఎం, జిల్లా పరిశ్రమల కేంద్రం

'జే-న్యూటౌన్' అక్రమాలపై కలెక్టర్ విచారణ



పుంగనూరు బైపాస్ రోడ్డులోని జే-న్యూ టౌన్

పుంగనూరు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు బైపాస్ రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన జే-న్యూటౌన్ వెంచర్ అక్రమాలపై కలెక్టర్ సుమిత్‌కుమార్ విచారణ చేపట్టారు. కర్నూలు-వేలూరు జాతీయ రహదారి పక్కనే రాయలపేటకు వెళ్లే మార్గం వద్ద వైసీపీ ప్రభుత్వంలో నాటి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సహకారంతో వైసీపీ నేత, మాజీ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి దాదాపు 70 ఎకరాల్లో వేసిన వెంచర్‌లో అక్రమాలు జరిగినట్లు కొందరు ముఖ్యమంత్రి చంద్రబాబుకు, మంత్రి లోకేశ్‌కు ఫిర్యాదులు చేశారు. ఈ క్రమంలో సీఎం కార్యాలయం, మంత్రి పేషీ నుంచి వచ్చిన ఆదేశాలతో సోమవారం కలెక్టరేట్‌లో అధికారులు, ఫిర్యాదుదారులతో కలెక్టర్ మాట్లాడారు. ఫిర్యాదుదారుల మాటల్లోనే.. 'వెంచర్ పక్కనే ఉన్న తీగలమ్మ చెరువు మొరవను ఆక్రమించి కాల్వను కుదించి సిమెంట్ పైపులు ఏర్పాటు చేశారు. 22ఏలో ఉన్న పొరంబోకు భూమిని కొంత ఆక్రమించి వెంచర్‌లో కలిపారు. బ్యూటిఫికేషన్ పేరుతో ఎస్‌హెచ్ రోడ్డును దర్జాగా ఆక్రమించారు. గుడిసెబండ పంచాయతీ పెంచుపల్లెకు వెళ్లే రోడ్డును వెంచర్‌లో కలిపేసుకున్నారు. మాజీ ఎంపీ ఎస్.రామకృష్ణారెడ్డి ఎంపీల్యాడ్స్‌తో నిర్మించిన బస్‌షెల్టర్లు కూల్చి వేసి.. ఆక్రమించారు. వెంచర్ పనులకు అక్రమంగా పంచాయతీ విద్యుత్ వాడుకున్నారు. విద్యుత్‌శాఖ ట్రాన్స్‌ఫార్మర్, పోల్స్ ఏర్పాటులోనూ అక్రమాలు జరిగాయి. ప్రభుత్వ నిబంధనలు పాటించలేదు' అని కలెక్టర్‌కు వివరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. జే-న్యూటౌన్‌పై సమగ్రంగా విచారించి నివేదిక ఇవ్వాలని తహసీల్దార్ జే.రాము, ఆర్ఐ ఫణికుమార్‌లను ఆదేశించారు. గతంలో ఉన్న తహసీల్దార్ శివయ్య విచారణ జరిపి నివేదిక ఇచ్చారని వారు చెప్పినా.. మీరు పరిశీలించి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. తాను కూడా త్వరలోనే జే-న్యూటౌన్ తనిఖీకి వస్తానని చెప్పారు.

'చిత్తూరు-గుడియాత్తం' రోడ్డుకు మహర్దశ

- ఏళ్లనాటి సమస్య పరిష్కారం
- రూ.5.90 కోట్ల ఉపాధి నిధుల కేటాయింపు
- నెలలో పనులు పూర్తయ్యేలా ప్రణాళిక

చిత్తూరు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): యాదమరి మీదుగా ఉండే 'చిత్తూరు-గుడియాత్తం' అంతర్రాష్ట్ర రహదారికి మహర్దశ పట్టనుంది. వైసీపీ ప్రభుత్వం పట్టించుకోక పోవడంతో ఛిద్రమైన ఈ రోడ్డు కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో బాగుపడనుంది. కలెక్టర్ సుమిత్‌కుమార్ చొరవ తీసుకుని రూ.5.90కోట్ల ఉపాధి హామీ పథకం నిధుల్ని కేటాయించారు. త్వరలో పనుల్ని ప్రారంభించి.. నెల రోజుల్లోనే పూర్తి చేసేలా ప్రణాళిక రచిస్తున్నారు.

వైసీపీ హయాంలో ఎన్నిసార్లు ప్రతిపాదనలు పంపినా..

యాదమరి మండలంలోని జోడిచింతల నుంచి తమిళనాడు సరిహద్దు వరకు 11కిలోమీటర్ల రహదారి అధ్వానంగా ఉంది. చిత్తూరు నుంచి యాదమరి మీదుగా గుడియాత్తం వరకు ఉన్న ఈ దారిలో ప్రయాణికులు నిత్యం ఇబ్బందులు పడుతున్నారు. గత ఏడాది పెట్రోల్ ట్యాంకర్ ఈ రోడ్డులో ఇరుక్కుంది. ఎక్స్‌కవేటర్ సాయంతో రోడ్డును పక్కకు లోడి.. బయటికి తీయాల్సి వచ్చింది. వైసీపీ హయాంలో ఈ రహదారి మరమ్మతులకు ఆర్‌అండ్‌బీ అధికారులు అనేకమార్లు ప్రతిపాదనలు పంపించినా నిధులు విడుదల కాలేదు. ప్రస్తుత పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ ఈ రోడ్డును బాగు చేయించేందుకు తీవ్రంగా కృషిచేసి.. రూ.10 కోట్లతో ప్రతిపాదనలు పంపించారు. ఈ క్రమంలోనే రూ.5.90 కోట్ల ఉపాధి హామీ నిధుల్ని కేటాయించారు.



గొల్లపల్లె- కొత్తూరు సమీపంలో ఛిద్రమైన రహదారి

కొత్త తరహాలో నిధుల కేటాయింపు

ఆర్‌అండ్‌బీ రోడ్డు మరమ్మతుల కోసం ఉపాధి హామీ నిధుల్ని వాడుకోవడం అనేది గతంలో లేదు. ఈ రోడ్డు మరమ్మతుకు ప్రభుత్వం నుంచి నిధులు ఆలస్యం అవుతుంటే.. కలెక్టర్ చొరవ తీసుకుని ఈ నిర్ణయాన్ని తీసుకున్నారు.

8 పంచాయతీల నుంచి తీర్మానం

ఈ రోడ్డుకు లింకు అయిన 8 పంచాయతీ సర్పంచుల నుంచి రూ.5.90 కోట్లకు తీర్మానాన్ని కలెక్టర్ తెప్పించుకున్నారు. వీటిల్లో.. దాసరపల్లె గ్రామ పంచాయతీ నుంచి రూ.34లక్షలు ఉండగా, 12-కమ్మపల్లె.. రూ.45 లక్షలు, కాశిరాళ్ల.. రూ.81 లక్షలు, ఓటేరిపాలెం.. రూ.146.50 లక్షలు, భూమిరెడ్డిపల్లె.. రూ.20 లక్షలు, సిద్దారెడ్డిపల్లె.. రూ.58 లక్షలు, పత్రపల్లె నుంచి రెండు విడతల్లో రూ.128 లక్షలు, రూ.77.80 లక్షల చొప్పున ఉన్నాయి.

గ్రామాల కనెక్టివిటీ కోసం

ప్రతి సోమవారం నిర్వహించే గ్రీవెన్స్ డేలో కనీసం నలుగురైనా ఈ రోడ్డు సమస్యపై ఫిర్యాదు చేస్తున్నారు. ఇప్పటికే ఈ మార్గంలో రెండుసార్లు నేను పర్యటించి సమస్య తీవ్రత తెలుసుకున్నాను. గ్రామాల కనెక్టివిటీని ప్రధాన రహదారితో మెరుగుపరిచేందుకు ఉపాధి నిధుల్ని వాడుకునేలా ప్రణాళిక చేశాం. ఆయా గ్రామాల నుంచి తీర్మానం తెప్పించుకుని నిధులు కేటాయించాం. త్వరలో పనులు ప్రారంభించి.. నెలలోనే పూర్తి చేస్తాం.

- సుమిత్‌కుమార్, కలెక్టర్

పల్లకిపై జనని.. పులకించిన అవని

తిరుచానూరు పద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాలు ఐదోరోజు సోమవారం ఆద్యంతం వైభవంగా సాగాయి. కమ్ముకున్న కారుమబ్బులూ.. ఉండి ఉండీ కురుస్తున్న వానజల్లుల నడుమ మాడవీధులు కళాబృందాల ప్రదర్శనలతో హోరెత్తాయి. లక్ష్మీకాసుల హారం ఊరేగింపు, వసంతోత్సవం సోమవారం విశేషంగా సాగాయి.

-తిరుచానూరు, ఆంధ్రజ్యోతి



మోహినీ రూపి

వాలుజడ వయ్యారం.. అర్ధనిమీలిత నేత్రాలు.. చిరుమందహాసం.. పున్నమి జాబిల్లిని మించి న ముఖారవిందంతో పద్మావతి అమ్మ మోహిని అవతారంలో పల్లకిలో ఊరేగారు. సోమవారం ఉదయం ఎనిమిది నుంచి పది గంటల దాకా మాడవీధుల్లో కిక్కిరిసిన భక్తజనసందోహం నడుమ పల్లకిసేవ సాగింది.



గంధము పుయ్యరుగ...

అమ్మవారికి గజవాహనం రోజున వసంతోత్సవం (చందనోత్సవం) వేడుకగా జరిగింది. సోమవారం మధ్యాహ్నం స్నపన తిరుమంజనం అనంతరం పద్మావతమ్మను ఆలయ ప్రదక్షిణగా సన్నిధి మండపానికి తీసుకొచ్చి పూజలు నిర్వహించారు. సాయంత్రం నాలుగు గంటలకు స్వర్ణ కమల తిరుచ్చిపై అమ్మవారిని తిరువీధుల్లో ఊరేగిస్తూ అర్చకులు, టీటీడీ అధికారులు చందనం కలిపిన నీటిని భక్తులపై చల్లుతూ.. చిరుజల్లుల నడుమ వసంతోత్సవాన్ని నిర్వహించారు.



నేడు గరుడవాహనం

- ఉదయం 8 గంటలకు : సర్వభూపాల వాహనం
- సాయంత్రం 4.20 : స్వర్ణరథోత్సవం
- రాత్రి 7 : గరుడవాహనం



దేవేరికి శ్రీవారి లక్ష్మీకాసుల హారం

గజవాహనమెక్కి ఊరేగే దేవేరి కోసం సోమవారం తిరుమల శ్రీనివాసుడు తన సహస్ర లక్ష్మీకాసుల హారాన్ని పంపారు. పున్నమి గరుడసేవలో శ్రీవారికి అలంకరించే ఈ హారాన్ని గజవాహన సేవలో అమ్మవారికి అలంకరించడం ఆనవాయితీ. ఉదయం తిరుమల ఆలయంలో లక్ష్మీకాసుల హారాన్ని శ్రీవారిపాదాల చెంత ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం తిరుమల మాడవీధుల్లో ఊరేగించి టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి తిరుచానూరుకు తీసుకువచ్చారు. తిరుచానూరు పసుపు మండపం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. శోభాయాత్ర మాడవీధుల నుంచి అమ్మవారి ఆలయం వరకు వేడుకగా సాగింది. హారాన్ని అమ్మవారి మూలవర్లకు అలంకరించారు. రాత్రి గజవాహనసేవలో అమ్మవారికి సహస్ర లక్ష్మీకాసుల హారాన్ని అలంకరించారు. ఈ కార్యక్రమంలో టీటీడీ ఛైర్మన్ బీఆర్.నాయుడు పాల్గొన్నారు.

ఇకపై నియోజకవర్గ కేంద్రాల్లోనూ పీజీఆర్ఎస్: కలెక్టర్



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్, ఆర్డీవో కిరణ్మయి

సూళ్లూరుపేట, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఇకపై నియోజకవర్గ కేంద్రాల్లోనూ ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్) కార్యక్రమాన్ని నిర్వహిస్తామని కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ తెలిపారు. సోమవారం సూళ్లూరుపేటలోని సత్యసాయి కల్యాణ మండపంలో నియోజకవర్గ స్థాయి ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ఆర్డీవో ఈ.కిరణ్మయి ఆధ్వర్యంలో నిర్వహించారు. కలెక్టర్‌తో పాటు వివిధ శాఖ అధికారులు పాల్గొని ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సూళ్లూరుపేట ప్రజలు తిరుపతి జిల్లా కేంద్రానికి రావడానికి దాదాపు 3 గంటలకు పైగా సమయం పడుతుందన్నారు. పేదలు అంతదూరం రాలేరని, జిల్లా అధికార యంత్రాంగమే ప్రజల వద్దకు వచ్చి వారి సమస్యలను పరిష్కరించేలా చొరవ చూపామన్నారు. ఇందులో భాగంగా తొలిసారిగా సూళ్లూరుపేటలో పీజీఆర్ఎస్ నిర్వహించి అర్జీలు స్వీకరించామన్నారు. ఇకపై ప్రతి రెండు వారాలకోసారి జిల్లాలో ఏదో ఒక నియోజకవర్గాన్ని ఎంచుకొని పీజీఆర్ఎస్ కార్యక్రమం నిర్వహిస్తామని చెప్పారు. కాగా, సూళ్లూరుపేట నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి మొత్తం 164 అర్జీలు వచ్చాయి. ఇందులో రెవెన్యూ డ్రైనేజీ, తాగునీరు సమస్యలను ప్రజలు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో తహసీల్దార్ నరసింహరావు, మున్సిపల్ కమిషనర్ చిన్నయ్య, ఎంపీడీవో ప్రమీలా రాణి, గృహనిర్మాణ శాఖ ఏఈ సత్యనారాయణ, పీఆర్ డీఈ రమణయ్య ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ చంద్రశేఖర్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

స్థానికుల్లో ఆనందం

- నేటి శ్రీవారి దర్శనానికి టోకెన్ల జారీ

తిరుపతి/తిరుమల, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): స్థానికులకు శ్రీవారి ఉచిత దర్శన టోకెన్లను సోమవారం జారీ చేయడంతో ఆనందోత్సాహాలు నెలకొన్నాయి. స్థానికులకు తొలిసారిగా 2013లో నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం శ్రీవారి దర్శనం కల్పించాలని నిర్ణయించింది. ఆ తర్వాత 2014లో చంద్రబాబు ముఖ్యమంత్రి అయ్యాక ప్రతినెలా మొదటి మంగళవారం 5వేల టోకెన్లు చొప్పున ఇస్తూ వచ్చారు. 2019లో జగన్ సీఎం కాగానే స్థానికుల దర్శనానికి మంగళం పాడారు. గతంలో తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి టీటీడీ ఛైర్మన్ అయినా స్థానికుల దర్శనం పట్టించుకోలేదు. గత ఎన్నికల్లో కూటమితరఫున పోటీచేసిన ఆరణి శ్రీనివాసులు ఎన్నికల హామీగా స్థానికులకు శ్రీవారి దర్శనం అంశాన్ని తీసుకొచ్చారు. ఈక్రమంలో నూతన ధర్మకర్తల మండలి ఏర్పాటయ్యాక.. తొలి సమావేశంలోనే స్థానికుల దర్శనాన్ని పునరుద్ధరించింది. గతంలో తిరుమల, తిరుపతి వారికే ఉండగా.. ఇప్పుడు చంద్రగిరి, రేణిగుంట మండలాలనూ కలిపారు. మంగళవారం నాటి దర్శనానికి సోమవారం ఉదయం తిరుపతిలోని మహతిలో టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు, తిరుపతి, చంద్రగిరి ఎమ్మెల్యేలు ఆరణి శ్రీనివాసులు, పులివర్తి నాని, టీటీడీ ఈవో శ్యామలరావు, అదనపు ఈవో వెంకయ్యచౌదరి కలిసి కొంతమంది స్థానికులకు స్వయంగా టోకెన్లు జారీ చేశారు. వేకువజాము 4నుంచి ఉదయం 11.30 గంటలకే 2500 టోకెన్లు పూర్తయ్యాయి. తిరుమలలోని బాలాజీనగర్ కమ్యూనిటీ హాలులో ఉదయం 7.30 గంటలకు టోకెన్ల జారీని ప్రారంభించారు. ఈ టోకెన్లు పొందిన వారికి.. తిరిగి మూడు నెలల తర్వాతే అవకాశం ఉంటుంది. దీంతో వైకుంఠ ద్వార దర్శనానికి టోకెన్లు రావనే భయంతో కొందరు వెనకడుగు వేశారు. దీంతో తిరుమలలో 500 టోకెన్లు స్థానికుల కోసం కేటాయించినా.. 403 మాత్రమే తీసుకోగా 97 మిగిలిపోయాయి. ఈ టోకెన్లు తీసుకున్న వారు మంగళవారం ఉదయం ఒరిజినల్ ఆధార్ కార్డులతో.. ఆయా టైం స్లాట్ల ప్రకారం దివ్యదర్శనం క్యూలో వెళ్లి శ్రీవారిని దర్శించుకోవాల్సి ఉంటుంది.



తిరుమలలో టోకెన్లు పొందిన స్థానికులు

ఇదో గొప్ప అవకాశం

తిరుమల, తిరుపతి, చంద్రగిరి, రేణిగుంట స్థానికులకు ఇదో గొప్ప అవకాశమని టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు అన్నారు. తొలిబోర్డులోనే తీసుకున్న నిర్ణయాన్ని ఎంతో కష్టపడి ఇంత త్వరగా అమలు చేసిన అధికారులకు ధన్యవాదాలు తెలిపారు. ఇకపై ప్రతి నెలా మొదటి మంగళవారం దర్శనానికి ఆదివారం టోకెన్లు జారీ చేయనున్నట్లు ఈవో శ్యామలరావు చెప్పారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా స్థానికుల దర్శనానికి ప్రణాళికలు రూపొందించుకున్నామని అదనపు ఈవో వెంకయ్య చౌదరి తెలిపారు. వైకుంఠ ఏకాదశి టోకెన్లకు, స్థానికుల దర్శన టోకెన్లకు సంబంధించి త్వరలోనే స్పష్టత ఇస్తామన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ నిలబెట్టుకున్నామని తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు పేర్కొన్నారు. స్థానికుల కోటాలో తిరుపతి రూరల్, చంద్రగిరి మండలాలకు అవకాశం ఇవ్వడం ఆనందంగా ఉందని ఎమ్మెల్యే పులివర్తి నాని అన్నారు. సాధారణ దర్శనాలే కాకుండా ఆర్జిత సేవల్లోనూ ప్రత్యేక కోటా ఇవ్వాలని కేంద్రమాజీ మంత్రి చింతా మోహన్ కోరారు. గతంలో ఉన్న 5వేల టోకెన్లు మూడు వేలకు కుదించడం సరికాదన్నారు. గత ఐదేళ్లలో తిరుమల శ్రీవారికి, స్థానికులకు ఉన్న అనుబంధాన్ని విడగొట్టిన వైసీపీ తగిన మూల్యం చెల్లించుకుందని బీజేపీ నేత నవీన్‌కుమార్‌రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్డీఏ కూటమి నేతలు నరసింహ యాదవ్, ఆర్సీ మునికృష్ణ, వరప్రసాద్, రాజా రెడ్డి, ఆర్కాట్ కృష్ణప్రసాద్, ఆముదాల వెంకటేష్, కూరపాటి సురేష్, మునస్వామి, యాదవకృష్ణ పాల్గొన్నారు.



తిరుపతిలో టోకెన్ల కోసం క్యూలో వెళుతున్న స్థానికులు





ప్రొఫెసర్ చెంగయ్య కారుపై దాడి చేసిన దృశ్యం - ఉద్యోగులు, విద్యార్థుల వాట్సప్ గ్రూపులో అన్యమత ప్రచారం

ఎస్వీయూ ఇంజినీరింగ్ కాలేజీలో ‘అన్యమత’ కలకలం

- ప్రచారం చేస్తున్నారంటూ ఓ ప్రొఫెసర్‌పై భజరంగదళ్, ఏబీవీపీ ఆరోపణ

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూనివర్సిటీ ఇంజినీరింగ్ కాలేజీలో సోమవారం అన్యమత ప్రచారంపై కలకలం రేగింది. ఈఈఈ విభాగ ప్రొఫెసర్ సీహెచ్ చెంగయ్య మత ప్రచారం చేస్తున్నారంటూ భజరంగ్‌దళ్, ఏబీవీపీ ఆరోపించాయి. యూనివర్సిటీ, కాలేజీ జారీ చేసే సర్క్యులర్‌పైన 'ప్రైజ్ ద లార్డ్' అని రాయడాన్ని వారు తప్పుపట్టారు. సోమవారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో భజరంగ్‌దళ్ నాయకులు విష్ణు ప్రతీక్ రెడ్డి, కిరీటి, ఏబీవీపీ నాయకులు పూజారి రాఘవేంద్ర, సురేంద్ర తదితరులు ఇంజినీరింగ్ కాలేజీ వద్దకు చేరుకొని ఆందోళన చేపట్టారు. ప్రొఫెసర్ చెంగయ్య చాంబరులోకి వెళ్లి వర్సిటీలో మత ప్రచారం ఎలా చేస్తారంటూ నిలదీశారు. ఆయన్ను చొక్కా పట్టుకొని బయటకు తీసుకొచ్చిన వారు.. ఇటుకలతో కారుపై దాడి చేశారు. అనంతరం వారు ఎస్వీయూ ఇన్‌చార్జి వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడికి ఫిర్యాదు చేశారు. దీనిపై విచారించి చర్యలు తీసుకుంటామని అధికారులు హామీ ఇచ్చారు. కాగా, హెడ్ రూములో కుర్చీ వెనుక గల వేంకటేశ్వర స్వామి పటాన్ని తొలగించారని, స్టూడెంట్స్, ఎంప్లాయీస్ ఉన్న వాట్సప్ గ్రూప్‌లలో ఏసు స్తోత్రాలు, వీడియోలు పంపుతున్నారని ప్రొఫెసర్ చెంగయ్యపై ఫిర్యాదులు వచ్చాయి.

మహిళా ప్రొఫెసర్ ఫిర్యాదుతో కమిటీ

కాగా, అసభ్యంగా ప్రవర్తిస్తున్నారని, మత వివక్ష చూపుతున్నారని ప్రొఫెసర్ చెంగయ్యపై మహిళా ప్రొఫెసర్ ఉషారెడ్డి వీసీ, రిజిస్ట్రార్‌కు మౌఖిక ఫిర్యాదు చేశారు. కాలేజీ ప్రిన్సిపాల్ ద్వారా ఫిర్యాదు వస్తేనే తాము పరిశీలిస్తామని వారు చెప్పినట్లు తెలిసింది. దీంతో ఎస్వీయూ ఇంజినీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ శ్రీనివాసులుకు ఆమె ఫిర్యాదు చేశారు. వృత్తిపరమైన వేధింపులకు గురి చేస్తున్నారనీ, రాత్రి దాకా తమను విభాగంలోనే ఉండేలా చేసేలా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. దీంతో వైస్ ప్రిన్సిపాల్ సుబ్బారావు నేతృత్వంలో ఐదుగురు మహిళా ప్రొఫెసర్లతో ఆయన విచారణ కమిటీని ఏర్పాటు చేశారు. లేడీ ఫ్యాకల్టీతో పాటు ఈఈఈ విభాగానికి చెందిన విద్యార్థులు, ఉద్యోగులందరిని ఈ కమిటీ విచారిస్తుందని ప్రిన్సిపాల్ శ్రీనివాసులు తెలిపారు. కాలేజీ కౌన్సిల్‌లోనూ దీనిపై చర్చించామని, విచారణలో భాగంగా ప్రొఫెసర్ చెంగయ్యను పిలిచి మాట్లాడినట్లు చెప్పారు. ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తామన్నారు.

14 మంది ఎర్రస్మగ్లర్ల అరెస్ట్

రెండు వాహనాలు, రంపాలు, గొడ్డళ్ల స్వాధీనం

మంగళం/ఏర్పేడు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఏర్పేడు అటవీ ప్రాంతంలోకి చొరబడుతున్న 14 మంది స్మగ్లర్లను టాస్క్‌ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రెండు వాహనాలు, గొడ్డళ్లు, రంపాలను స్వాధీనం చేసుకున్నారు. టాస్క్‌ఫోర్స్ ఆర్ఎస్ఐ లింగాధర్ బృందం ఆదివారం రాత్రి కృష్ణాపురం ఫారెస్ట్ సెక్షన్‌లో ఎంట్రీ ఎగ్జిట్ పాయింట్లలో తనిఖీలు నిర్వహించారు. చింతపాలెం సమీపంలోని నిషేధిత అటవీ ప్రాంతంలో ఒక ఇన్నోవా, బొలేరో గూడ్స్ వాహనాల్లో కొంతమంది అనుమానాస్పదంగా దిగుతూ కనిపించారు. టాస్క్‌ఫోర్స్ సిబ్బంది చుట్టుముట్టి 14 మందిని అదుపులోకి తీసుకున్నారు. వారిని తనిఖీ చేయగా పిడిలేని ఇనుప బరిసెలు, గొడ్డళ్లు, రంపపు చుట్ట వంట సామగ్రి దొరికాయి. పట్టుబడ్డ వారిలో 13 మంది తమిళనాడుకు చెందిన వారు కాగా ఒకరు చిత్తూరు జిల్లాకు చెందిన వ్యక్తిగా గుర్తించారు. పట్టుపడ్డ స్మగ్లర్లను, వాహనాలను, గొడ్డళ్లు, రంపాలను తిరుపతి టాస్క్‌ఫోర్స్ పోలీసు స్టేషన్‌కు తరలించి, సీఐ సురేష్‌కుమార్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.



స్మగ్లర్ల అరెస్ట్ చూపుతున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు

చెవిరెడ్డి చేసింది తప్పుకాదా?

దీనిపై ప్రతిఒక్కరూ ఆలోచించండి ● బాలిక తండ్రి గొంతు నొక్కేసినా సాక్ష్యాలు ఉన్నాయన్న ఎమ్మెల్యే నాని

తిరుపతి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): 'చెవిరెడ్డి భాస్కర్ రెడ్డిని నమ్మి వైసీపీ నేతలు పదేపదే మోసపోతుంటారు. ఎర్రావారిపాలేనికి చెందిన బాలిక తండ్రిని నేనెప్పుడూ విమర్శించను. గతంలో ఆయన ఏమి మాట్లాడారో, ఇప్పుడు ఏమి మాట్లాడుతున్నాడో ప్రజలందరికీ తెలుసు. చెవిరెడ్డి చేసింది తప్పు కాదా? అని మాత్రమే ఆలోచించండి. మనకి కూడా ఆడబిడ్డలు ఉన్నారు. మీవిజ్ఞతకే వదిలేస్తున్నా' అని చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని వ్యాఖ్యానించారు. ఎర్రావారిపాళెం మండలం యల్లమంద ఘటనపై బాలిక తండ్రితో కలిసి వైసీపీ నేతలు భూమన కరుణాకరరెడ్డి, నారాయణస్వామి ఆదివారం మీడియాతో మాట్లాడిన వ్యవహారంపై సోమవారం నాని స్పందించారు. యల్లమంద ఘటన సమయంలో రమణతో కలసి ఆయన కోడలు మాట్లాడిన వీడియోలను మీడియాకు చూపించారు. ఫిర్యాదుదారుల గొంతు నొక్కేస్తే సుమోటాగా కూడా తీసుకునే అవకాశం పోక్సో కేసులకు ఉందన్న విషయం వైసీపీ నేతలు గుర్తుపెట్టుకోవాలన్నారు. గత ఐదేళ్లుగా చెవిరెడ్డిపై పోరాటం చేస్తున్నానని, భూమనకు శిష్యుడునని చెప్పుకునే చెవిరెడ్డి ఆయన పట్ల ఎలా నడుచుకుంటున్నారో కూడా అందరికీ తెలుసన్నారు. పోలీసులు కక్షసాధింపుగా కేసులు పెడుతున్నారని చెప్పడం సరికాదన్నారు. ఇంకా వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు నియోజకవర్గంలో అనవసరంగా 37 మంది టీడీపీ నాయకులపై చెవిరెడ్డి కేసులు పెట్టించారని గుర్తుచేశారు. ఆడబిడ్డకు అన్యాయం జరిగిందా? లేదా? అని మాత్రమే ఆలోచించాలన్నారు. సాక్ష్యాలు అనేవి ఖచ్చితంగా ఉంటాయని, న్యాయవ్యవస్థ ఎవరికి అన్యాయం జరిగిందో వారిని కాపాడితీరుతుందన్నారు. గత ఐదేళ్లలో తిరుపతి రూరల్లో అభివృద్ధి ఆగిపోయిందని, ఇప్పుడు వేగంగా నిర్మాణాలు జరుగుతున్నాయన్నారు. ప్రజలు గుండెలపై చేయి వేసుకుని ప్రశాంతంగా నిద్రపోతున్నారన్నారు.

నాణ్యమైన మద్యం కాదు.. విద్యనందించాలి

- సీపీఎం జిల్లా సభల ముగింపు కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యురాలు రమాదేవి



సమావేశంలో మాట్లాడుతున్న రమాదేవి

సత్యవేడు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రజలు కావాల్సింది నాణ్యమైన మద్యం కాదని.. నాణ్యమైన విద్య అని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యురాలు డి.రమాదేవి అన్నారు. సత్యవేడులో సోమవారం జరిగిన సీపీఎం 14వ జిల్లా సభల ముగింపు సమావేశంలో ఆమె మాట్లాడారు. ఆధ్యాత్మిక నగరమైన తిరుపతిని స్మార్ట్‌సిటీగా చేస్తామన్న పాలకులు వెంకన్న చెంత మద్యపుటేర్లు పారిస్తున్నారని ధ్వజమెత్తారు. వెంకటగిరి, శ్రీకాళహస్తి, చంద్రగిరి నియోజకవర్గాలకు తాగు, సాగు నీరు అందించడమే లక్ష్యంగా ప్రారంభమైన సోమశిల- స్వర్ణముఖి లింకు కెనాల్ పనులు పూర్తి చేయాలన్నారు. అదానీ సోలార్ కుంభకోణంపై దేశవ్యాప్తంగా చర్చ జరగాల్సిన అవసరం ఉందన్నారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ పేరిట రాష్ట్ర ప్రజల నుంచి పన్నులు వసూలు చేసి అదానీ, అంబానీలకు ధారాదత్తం చేసేలా కూటమి సర్కారు పనితీరు ఉందని మండిపడ్డారు. జిల్లా సమగ్రాభివృద్ధికి 28 అంశాలతో కూడిన తీర్మానాలను సభలో ఆమోదించారు. నాయకులు రమేష్, గంధం మణి, గురవయ్య తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం జిల్లా కార్యదర్శిగా నాగరాజు



జిల్లా సీపీఎం కార్యదర్శిగా వందవాసి నాగరాజు ఎన్నికయ్యారు. జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులుగా కందారపు మురళి, అంగేరి పుల్లయ్య, టీ.సుబ్రమణ్యం, దాసరి జనార్దన్, సభ్యులుగా భగత్, సాయిలక్ష్మి, జయచంద్ర, మాధవ్, ఆర్.వెంకటేష్, హరినాథ్, వేణుగోపాల్, బి.రవి, ఆర్.లక్ష్మి, జోగి రవికుమార్ ఎన్నికయ్యారు. ఎన్నికల పరిశీలకులుగా సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డి.రమాదేవి, మూలం రమేష్, రాష్ట్ర కమిటీ సభ్యులు భాస్కరయ్య వ్యవహరించారు.

శ్రీవారి దర్శనానికి 8 గంటలు

తిరుమల, డిసెంబరు2 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 8 గంటల సమయం పడుతోంది. 16 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు.. 2 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచిఉన్నారు. శనివారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ ఆదివారం లెక్కించింది. రూ.3.33 కోట్లు ఆదాయం లభించినట్టు సోమవారం ఉదయం ప్రకటించింది.

ఒడిశా నుంచి కాలినడకన శబరిమలైకు..


శబరిమలైకి వెళ్తున్న ఒడిశా వాసులు

గుడిపాల, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఒడిశా నుంచి ముగ్గురు భక్తులు శబరిమలై నడిచి వెళ్తున్నారు. ఈక్రమంలో సోమవారం గుడిపాల చేరుకున్నారు. తాము అక్టోబరు 26వ తేదీన ఒడిశా నుంచి కాలినడకన బయలుదేరామన్నారు. ఇప్పటికి 38 రోజులు పూర్తయ్యాయన్నారు. మరో 22 రోజుల్లో శబరిమలై చేరుకుంటామని వెంకటరమణ, శ్రీను, రాజేంద్ర తెలిపారు.

కృష్ణాపురం జలాశయం గేటు ఎత్తివేత

వెదురుకుప్పం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం మండలం కృష్ణాపురం జలాశయం గేటు ఒక దాన్ని సోమవారం రాత్రి తొమ్మిది గంటలకు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేశారు. ఒక గేటు మాత్రమే ఎత్తినట్లు నీటి పారుదల శాఖ డీఈ మురళి, ఏఈ భాస్కర్ రాజు తెలిపారు. రిజర్వాయర్‌లోకి ఇన్ ఫ్లో 400 క్యూసెక్కులుగా ఉంటే, ఔట్ ఫ్లో 800 క్యూసెక్కులని తెలిపారు. రెవెన్యూ, పోలీసు యంత్రాంగం కూడా పాల్గొన్నారు.

వరసిద్ధుడి సేవలో ఎన్సీసీ డీజీ


ఎన్సీసీ డీజీకి జ్ఞాపికను అందిస్తున్న ఈవో గురుప్రసాద్

ఐరాల(కాణిపాకం), డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): కాణిపాక వరసిద్ధి వినాయక స్వామిని సోమవారం ఏపీ,తెలంగాణ ఎన్సీసీ డీజీ (డైరెక్టర్ జనరల్) మధుసూదనరెడ్డి సోమవారం దర్శించుకున్నారు. ఈవో గురుప్రసాద్ ఆలయ మర్యాదలతో ఆహ్వానించి స్వామి దర్శన ఏర్పాట్లను పర్యవేక్షించారు. దర్శనానంతరం వేదమంత్రాలతో ఆశీర్వదించి స్వామి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు, జ్ఞాపికను అందించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ వాసు, ఆలయ ఇన్‌స్పెక్టర్ విఘ్నేష్ తదితరులు పాల్గొన్నారు. వరసిద్ధుడి ఆలయ హుండీని మంగళవారం నిర్వహించనున్నట్లు ఈవో తెలియజేశారు.

ఎలిఫెంట్ హబ్ త్వరగా పూర్తిచేయండి


రేంజర్‌తో చర్చిస్తున్న ఎమ్మెల్యే అమరనాథరెడ్డి

పలమనేరు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): పలమనేరు మండలం ముసలిమడుగు సమీపంలోని అటవీ ప్రాంతంలో ఏర్పాటు చేస్తున్న ఎలిఫెంట్ హబ్ త్వరగా పూర్తిచేయాలని ఎమ్మెల్యే అమరనాథరెడ్డి అటవీ అధికారులను ఆదేశించారు. హబ్ పురోగతిపై సోమవారం రేంజర్ నారాయణతో చర్చించారు. ఇప్పటికే రెండువారాలుగా 20 మందికి పైగా ఎలిఫెంట్ ట్రాకర్స్, అటవీసిబ్బంది కర్ణాటకలో శిక్షణ పొందుతున్నారని రేంజర్ తెలిపారు. ఈ ఎలిఫెంట్ హబ్ ఏర్పాటుకు సంబంధించి ప్రాజెక్టు రిపోర్టు ఉన్నతాధికారులకు పంపామని వివరించారు. ఈ ప్రాజెక్టు ప్రధానంగా పలమనేరు ప్రాంతంలో పంటలను నాశనం చేస్తున్న ఏనుగులను అందులోను మదపుటేనుగులను కట్టడి చేసేందుకు క్రాల్స్ ఏర్పాటు, శిక్షణ పొందిన ఏనుగుల కోసం ఎన్‌క్లోజర్స్, సిబ్బంది క్వార్టర్స్, డిస్పెన్సరీ ఏర్పాటు కోసం ఉద్దేశించినదని వివరించారు. త్వరగా మంచి టూరిజం హబ్ ఏర్పాటయ్యేలా చొరవచూపాలని రేంజర్‌కు ఎమ్మెల్యే సూచించారు. నిధుల ఇబ్బందులుంటే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని హామీనిచ్చారు. కాగా ఎలిఫెంట్ టూరిజం హబ్ ఏర్పాటుపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

15లోగా వేరుశనగ ప్రీమియం చెల్లించాలి

● రైతులకు కలెక్టర్ సూచన


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్, పాల్గొన్న జిల్లా అధికారులు

చిత్తూరు కలెక్టరేట్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): పీఎం ఫసల్ బీమా యోజనను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లో వ్యవసాయ ఆధారిత పంటల బీమా పథకం పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పథకం కింద ఎంపిక చేసిన పంటలకు సంబంధించి రైతులు నిర్ణీత సమయంలోగా ప్రీమియం చెల్లించి.. పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. వరి ఎకరాకు రూ.42వేల బీమా ఉందన్నారు. రైతులు ప్రీమియం వాటాగా రూ.84గా చెల్లించాలన్నారు. వేరుశనగకు ఎకరాకు రూ.30వేల బీమా ఉండగా రైతులు ప్రీమియం వాటాగా రూ.60 చెల్లించాలన్నారు. వేరుశనగ ప్రీమియం ఈనెల 15లోగా, వరి ప్రీమియం ఈనెల 31లోగా చెల్లించవచ్చన్నారు. సమావేశంలో అధికారులు మురళీకృష్ణ, మధుసూదన్ రెడ్డి, ప్రభాకర్, ఎల్డీఎం హరీష్, సీపీవో సాంబశివారెడ్డి, చిత్తూరు ఆర్డీవో శ్రీనివాసులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ప్రీమియం చెల్లింపుల్లో దళారులను నమ్మొద్దు: జేసీ


వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులతో సమీక్షిస్తున్న జేసీ విద్యాధరి

చిత్తూరు కలెక్టరేట్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): పీఎం ఫసల్ బీమా యోజన ప్రీమియం చెల్లింపుల్లో దళారులను నమ్మొద్దని రైతులకు జేసీ విద్యాధరి సూచించారు. సోమవారం తన చాంబర్‌లో వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులతో సమీక్షించారు. ఈ పథకానికి కౌలు రైతులు కూడా అర్హులే అన్నారు. బ్యాంకుల ద్వారా రుణాలు పొందిన రైతులు.. బ్యాంకుల్లోనే ప్రీమియం చెల్లించి బీమా సౌకర్యం పొందవచ్చన్నారు. రుణాలు పొందని రైతులు తమ ప్రాంతానికి సమీపంలోని సచివాలయం, పోస్టాఫీసు, కామన్ సర్వీస్ సెంటర్ల ద్వారా ప్రీమియం చెల్లించే సౌకర్యం ఉందన్నారు. నేషనల్ క్రాప్ ఇన్సూరెన్స్ పోర్టల్ లేదా వెబ్‌సైట్ లేదా మొబైల్ యాప్ ద్వారా పేర్లు నమోదు చేసుకోవచ్చన్నారు. బీమా చేసిన పంట వివరాలు ఈ-పంటలో అధికారులు సక్రమంగా నమోదు చేశారో లేదో సరిచూసుకోవాల్సిన బాధ్యత రైతులదే అన్నారు. వ్యవసాయ, ఉద్యాన, పశుసంవర్థక శాఖ అధికారులు మురళీకృష్ణ, మధుసూదన్‌రెడ్డి, ప్రభాకర్, ఎల్డీఎం హరీష్, సీపీవో సాంబశివారెడ్డి, చిత్తూరు ఆర్డీవో శ్రీనివాసులు, ఇతర అధికారులు పాల్గొన్నారు. అంతకుముందు ఉద్యాన పంటకు సంబంధించి పీఎం ఫసల్‌బీమా యోజన పోస్టర్‌ను కొత్తగ్రీవెన్స్‌హాలులో కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆవిష్కరించారు.

పీహెచ్‌సీలోపోస్టుల భర్తీకి చర్యలు

వి.కోట, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): వి.కోట మండలంలోని ఓగు పీహెచ్‌సీలో పోస్టుల భర్తీకి చర్యలు తీసుకుంటామని డీఎంహెచ్‌వో ప్రభావతీదేవి తెలిపారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

సోమవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన 'అవార్డుల ఆస్పత్రికి సిబ్బంది కొరత' అనే కథనంపై ఆమె స్పందించారు. తక్షణం ఖాళీల వివరాలను తమ కార్యాలయానికి అందించాలని వైద్యాధికారిని ఆదేశించారు. ఆ మేరకు డాక్టర్ మాధవి జిల్లా కేంద్రానికి ఖాళీల వివరాలపై నివేదిక పంపారు.

విషాదం

- తమిళనాడు వరదలో కొట్టుకుపోయిన వీకేఆర్‌పురం దళితవాడవాసి


లక్ష్మయ్య(ఫైల్‌ఫోటో)

నగరి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): నగరి మండల పరిధిలోని వీకేఆర్ పురం దళితవాడకు చెందిన లక్ష్మయ్య(52) సోమవారం తమిళనాడులోని కనకమ్మ సత్రం సమీపాన ఉన్న రామంజేరికి సొంత పనిపై వెళ్లాడు. ఈ సమయంలో వరద ప్రవాహం రావడంతో కొట్టుకుపోయినట్లు బంధువులు తెలిపారు. తమిళనాడు పోలీసులు మృతదేహం కోసం గాలిస్తున్నారు.

ఇద్దరు గంజాయి దొంగల అరెస్టు

చిత్తూరు అర్బన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఇద్దరు గంజాయి దొంగలను ఒకటో పట్టణ పోలీసులు పట్టుకున్నారు. సీఐ జయరామయ్య తెలిపిన వివరాల మేరకు.. సోమవారం అందిన రహస్య సమాచారంతో వీఆర్వోల సమక్షంలో చిత్తూరులోని కొండమిట్ట, ఏఆర్ టాప్‌లైన్, శిథిలమైన నివాస గృహాల్లో తనిఖీలు చేశారు. అక్కడ చామంతిపురానికి చెందిన రామమూర్తి, కొంగారెడ్డిపల్లె మారియమ్మన్‌వీధికి చెందిన చేతన్‌ను అదుపులోకి తీసుకుని తనిఖీ చేశారు. వారి వద్ద 65,250 విలువైన చేసే రెండు కిలోల 175 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

దారి లేకుండా చేసిన వారిపై చర్యలు తీసుకోండి

● 'పీజీఆర్ఎస్'లో కలెక్టర్‌కు బాధితుల ఫిర్యాదు


బాధితులతో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్, జేసీ విద్యాధరి

చిత్తూరు అర్బన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కారం వేదిక (పీజీఆర్ఎస్) జరిగింది. ప్రజల నుంచి అర్జీలను కలెక్టర్ సుమిత్‌కుమార్, జేసీ విద్యాధరి, డీఆర్వో మోహన్ కుమార్ స్వీకరించారు. మొత్తం 101 మంది వినతిపత్రాలను కలెక్టరుకు బాధితులు అందించారు.

అధికారుల దృష్టికి వచ్చిన అర్జీల్లో కొన్ని..

● ప్రభుత్వం ఇచ్చిన స్థలంలో దారి లేకుండా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని బంగారుపాళ్యం మండలం మహాసముద్రం మాదిగవాడ ప్రజలు కోరారు. సర్వే నెంబరు 155-2లో 2.73 ఎకరాల భూమిలో 45 కుటుంబాల వారు ఇళ్ల నిర్మించుకుని ఉంటున్నామన్నారు. తమ ఇళ్లకు ముందుగా మరో 30 సెంట్ల భూమిలో అగ్రకులానికి చెందిన వారు ఇళ్ల కట్టుకుని దారి లేకుండా చేశారని ఆవేదన వ్యక్తం చేశారు.

● దౌర్జన్యంగా ఆక్రమించుకున్న భూమిని తిరిగి అప్పగించాలని వీకోట మండలం బేబికొత్తూరుకు చెందిన తిప్పయ్య కోరారు. సర్వే నెంబరు 477-18లో 4.12 ఎకరాల భూమి తన తల్లిపేరుపై ఉందన్నారు. ఈ భూమిని గ్రామానికి చెందిన ఓ వ్యక్తి దౌర్జన్యంగా ఆక్రమించుకున్నాడన్నారు.

● ఎనిమిది ఎకరాల కాలువ పరంబోకు భూములను ఆక్రమించుకుని, పక్క పొలాల వారిని బెదిరింపులకు గురి చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని యాదమరి మండలం దాసరాపల్లె పంచాయతికి చెందిన దామోదరచౌదరి కోరారు. భూమిని ఆక్రమించుకుని మామిడి మొక్కలు, కొబ్బరి, అరటి, నిమ్మచెట్లను పెంచుకుంటున్నారన్నారు.

● ఇంటికి వెళ్లడానికి దారి సౌకర్యాన్ని కల్పించాలని వెదురుకుప్పం మండలం తూర్పు దళితవాడకు చెందిన చెంగమ్మ కోరారు. సర్వే నెంబరు 228-18లో ఒక పూరి గుడిసెలో నివాసముంటున్నానని తెలిపారు. ఇంటికి వెళ్లడానికి దారి లేదన్నారు.

● తాత పేరు మీదున్న భూమిని తన పేరుమీద మార్చాలని తవణంపల్లె మండలం పట్రపల్లెకు చెందిన దొరస్వామి కోరారు. పలుమార్లు తహసీల్దార్‌ను కోరినా ఫలితం లేదన్నారు. గ్రామస్థులకు స్మశాన స్థలం కావాలని కోరారు.

పోలీసు కార్యాలయానికి 24 మంది బాధితులు


బాధితులతో మాట్లాడుతున్న ఎస్పీ మణికంఠ

పోలీసు కార్యాలయంలో పీజీఆర్ఎస్ కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి 24 మంది హాజరై ఎస్పీ మణికంఠ, ఏఎస్పీ రాజశేఖరరాజులకు వినతి పత్రాలను అందించారు. భూ తగాదాలు 7, ఇంటి తగాదాలు 5, కుటుంబ తగాదాలు 4, వేధింపులు 4, డబ్బు తగాదాలు 3, చీటింగ్ కింద ఒక్క అర్జీ చొప్పున అందాయి.

గజలక్ష్మి నమోస్తుతే!



సోమవారం రాత్రి 7 గంటల నుంచి గజవాహన సేవ నయనానందకరంగా సాగింది. బంగారుకాసుల హారాన్ని ధరించిన అమ్మవారు గజవాహనంపై శ్రీమహాలక్ష్మి రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారికి అత్యంత ప్రీతిపాత్రమైనది గజవాహనం. ఐశ్వర్యానికి ప్రతిరూపమైన గజవాహనంపై కొలువుదీరిన అమ్మవారు తిరువీధుల్లో ఊరేగుతూ భక్తజన హృదయాలను రంజింపచేశారు. కీలుగుర్రాలు, మంగళవాయిద్యాలు, భక్తుల కోలాటాలు, చెక్కభజనలు, జీయర్ల పరివారం ప్రబంధ పారాయణం చేస్తుండగా గజవాహనసేవ మాడవీధుల్లో సాగింది.

- తిరుచానూరు, ఆంధ్రజ్యోతి

కిక్కిరిసిన మాడవీధులు



తిరుచానూరు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి జరిగిన గజవాహన సేవకు అశేష భక్తజనం విచ్చేశారు. సాయంత్రం 6 గంటలకు మాడవీధులు నిండిపోయాయి. వేల సంఖ్యలో భక్తులు అమ్మవారికి కర్పూర నారికేళాలు సమర్పించారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని తొక్కిసలాటలు జరగకుండా జేఈవో వీరబ్రహ్మం దగ్గరుండి హారతులు ఇచ్చే భక్తులను క్రమపద్ధతిలో పంపించారు. రాత్రి 10 గంటలకు వాహనం సూర్యనారాయణస్వామి ఆలయం వద్దకు చేరుకుంది. వేలాదిమంది రావడంతో తిరుచానూరు జనసంద్రంగా మారింది. కార్యక్రమంలో టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో శ్యామలరావు, కలెక్టర్ వెంకటేశ్వర్, అడిషనల్ ఈవో వెంకయ్య చౌదరి, జేఈవో వీరబ్రహ్మం, ఎమ్మెల్యే పులివర్తి నాని, బోర్డు మెంబర్ యెల్లా సుచిత్ర, డిప్యూటీ ఈవో గోవిందరాజన్ పాల్గొన్నారు.

క్రీడా, సాంస్కృతిక పోటీల్లో ఎస్వీ వ్యవసాయ కళాశాల విద్యార్థుల ప్రతిభ


క్రీడాకారులను అభినందిస్తున్న డీన్ డాక్టర్ ఎంవీ రమణ

తిరుపతి(క్రీడలు), డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ అంతర కళాశాలల క్రీడా, సాంస్కృతిక పోటీల్లో ఎస్వీ వ్యవసాయ కళాశాల విద్యార్థులు పలు విభాగాల్లో ప్రతిభ కనబరిచారు. బాపట్ల, నైరా, తిరుపతి మైదానాల్లో మూడు విడతలలో రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహించారు. తిరుపతి ఎస్వీ వ్యవసాయ కళాశాల విద్యార్థులు బాస్కెట్‌బాల్, టేబుల్‌టెన్నిస్, ఫుట్‌బాల్‌లలో విజేతలుగా నిలిచారు. వందమీటర్ల పరుగుపందెంలో రెండో స్థానం, 200 మీటర్లు, 400 మీటర్లలో మూడోస్థానంతో సరిపెట్టుకున్నారు. మహిళా విభాగం చదరంగంలో రన్నరప్‌గా, లాంగ్‌జంప్‌లో రెండో స్థానం, హైజంప్‌లో మూడో స్థానం దక్కించుకున్నారు. ఓవరాల్ చాంపియన్‌షిప్‌ను శ్రీవేంకటేశ్వర వ్యవసాయ కళాశాల విద్యార్థులు కైవసం చేసుకున్నారు. సోమవారం కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ఎం.వి.రమణ క్రీడాకారులను అభినందించారు.

యువకుడి అనుమానాస్పద మృతి


మృతిచెందిన విజయ్ (ఫైల్‌ఫోటో)

పలమనేరు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): పలమనేరు మున్సిపాలిటీ గొబ్బిళ్ల కోటూరు గ్రామానికి చెందిన సహదేవ చిన్నకుమారుడు విజయ్ (20) అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. విజయ్ గ్రామ సమీపంలోని ఓ చెట్టుకు ఉరివేసుకొని చనిపోయి ఉండడాన్ని సోమవారం గ్రామస్తులు గుర్తించారు. దేహంపై గాయాలు ఉండడంతో ఎవరైనా హత్యచేసి ఉంటారని గ్రామస్తులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పలమనేరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.మృతుడి తండ్రి ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేశారు.

కొండచిలువ హల్‌చల్



వరదయ్యపాళెం, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముస్లింపాళెం గ్రామానికి వెళ్లే దారిలో ఓ భారీ కొండచిలువ సోమవారం రాత్రి హల్‌చల్ చేసింది. దీంతో గ్రామస్తులు ఆందోళనకు గురయ్యారు. వారు మాట్లాడుతూ రాత్రిపూట కొండచిలువ సంచరిస్తోందని దాని కారణంగా తమ కోళ్లు మాయమవుతున్నాయన్నారు. సంబంధిత అధికారులు స్పందించి కొండచిలువను పట్టి అటవీప్రాంతంలో వదలివేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

సీఎం దృష్టికి పండ్ల పరిశ్రమదారుల సమస్యలు

● కలెక్టర్ హామీ


కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న పండ్ల పరిశ్రమ సమాఖ్య నాయకులు

చిత్తూరు కలెక్టరేట్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): పండ్ల పరిశ్రమదారులు ఎదుర్కొంటున్న సమస్యలను సీఎం చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్తానని కలెక్టర్ సుమిత్ కుమార్ హామీ ఇచ్చారు. జిల్లా పండ్ల పరిశ్రమల సమాఖ్య ప్రతినిధి బృందం సోమవారం రాత్రి కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేసింది. పండ్ల పరిశ్రమల్లో పారిశ్రామికవేత్తలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రతినిధి బృందం తెలియజేసింది. బ్యాంకర్లతో సమావేశమై త్వరగా రుణ మంజూరుపై చొరవ చూపాలని కోరారు. చిత్తూరులో ఏర్పాటు చేయనున్న కంటైనర్ డిపో అంశంపై చెన్నై, హైదరాబాదులోని ఐసీడీ యజమానులతో చర్చించాలని కోరారు. సమావేశంలో సమాఖ్య కార్యదర్శి కట్టమంచి గోవర్దన్, సభ్యులు తలుపులపల్లి బాబురెడ్డి, విద్యాసాగర్ రెడ్డి, సమీర్ శర్మ, సోమశేఖర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

గంజాయి విక్రేత అరెస్టు

నారాయణవనం, డిసెంబరు 2(ఆంధ్ర జ్యోతి): గంజాయి విక్రయిస్తున్న వ్యక్తిని సోమవారం అరెస్టు చేసినట్లు నారాయణ వనం రూరల్ సీఐ రవీంద్ర తెలిపారు. ఎస్ఐ రాజశేఖర్ సిబ్బందితో మండలంలోని కీళగరం చెరువు కట్టపై అనుమానాస్పదంగా తిరుగుతున్న వెంకటేష్‌ని అదుపులోకి తీసు కుని తనిఖీ చేయగా రెండు కిలోల గంజా యి ఉన్నట్టు గుర్తించారన్నారు. నిందితుడిని విచారించగా తిరుపతివాసిగా తేలిందన్నారు. తహసీల్దార్ సమక్షంలో నిందితుడిని అదుపులోనికి తీసుకుని, కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు తెలిపారు. గత సంవత్సరం కొయ్యూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో మరో కేసులో వెంకటేష్ నిందితుడిగా ఉన్నాడని తెలిపారు.

పంటలపై గజరాజుల దాడి

- అరటి, మామిడి, కొబ్బరి తోటలకు అపార నష్టం


ధ్వంసమైన మామిడి, అరటి, కొబ్బరి మొక్కలు - ఏనుగుల పాదముద్రలు

వి.కోట, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): వి.కోట మండల అటవీ సరిహద్దు గ్రామాల్లో గజరాజుల దాడులు మళ్లీ మొదలయ్యాయి. ఆదివారం రాత్రి వి.కోట మండలం నాయకనేరి అటవీ ప్రాంతం నుంచి సుమారు పది ఏనుగుల గుంపు బోయచిన్నాగనపల్లె గ్రామ సమీపంలోని పంటపొలాలపై పడ్డాయి. పలువురు రైతులకు చెందిన అరటి, మామిడి, బొప్పాయి, కొబ్బరి తోటల్లోకి ప్రవేశించి.. ధ్వంసం చేశాయి. సోమవారం ఉదయం పొలాల వద్దకు వెళ్లిన రైతులు ధ్వంసమైన పంటలను చూసి కన్నీటి పర్యంతమయ్యారు. నాయకనేరి అడవిలోని గోబిదోని కుంట వైపు నుంచి కంచెను దాటి ఏనుగుల గుంపు బి.సి. పల్లె సమీపంలోని హనుమంతగౌడు, మురళి అనే రైతులకు చెందిన మామిడి చెట్లను చాలా వరకు విరిచేశాయి. రెండెకరాల్లో సాగుచేసిన అరటి చెట్లను తొక్కి, తినేశాయి. పశుగ్రాసం, ఉలవచేను లను తొక్కేశాయి. అలాగే వాటి మధ్య భాగంలో నాటిన సుమారు 50 కొబ్బరి చెట్లను ధ్వంసం చేశాయి. శేషాద్రి, కొండప్పగౌడు అనే రైతులకు చెందిన స్వీట్‌కార్న్, కాలీఫ్లవర్, బొప్పాయి పంటలను తొక్కి నాశనం చేశాయి. రాధాకృష్ణ గౌడు, నారాయణస్వామి అనే రైతులకు చెందిన మెడిసిన్‌దోస, అరటి చెట్లను నష్టపరిచాయి. సుమారు రూ.2లక్షల పంట నష్టం సంభవించినట్లు రెవెన్యూ, అటవీ అధికారులకు బాధితులు రాతపూర్వకంగా తెలియజేశారు.

ఏడాది తర్వాత...

ఏడాది తర్వాత తిరిగి ఏనుగులు తమ పంటలపై దాడి చేశాయని రైతులు వాపోయారు. పంద్యాలమడుగు బీట్ నుంచి వచ్చిన ఏనుగుల గుంపును తమ గ్రామాల వైపు రాకుండా తగు చర్యలు తీసుకుకోవాలని కోరుతున్నారు. ఇన్నాళ్లూ ఒంటరి ఏనుగులు వస్తుంటే.. ఇప్పుడు ఏకంగా పది ఏనుగుల మంద రావడంతో రాత్రిపూట పొలాల వద్దకు వెళ్లాలంటే భయంగా ఉందన్నారు.

గుర్తు తెలియని వ్యక్తులచే

అంబేడ్కర్ విగ్రహం ధ్వంసం

● అనుమానితుల్ని విచారిస్తున్న పోలీసులు


పాతపాళ్యం దళితవాడలో ధ్వంసమైన అంబేడ్కర్ విగ్రహం

శ్రీరంగరాజపురం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఎస్ఆర్‌పురం మండలం పాతపాళ్యం దళితవాడలో రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ విగ్రహాన్ని గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. ఆదివారం రాత్రి జరిగిన ఈ సంఘటనపై పోలీసు కేసు నమోదైంది. అయితే ఫిర్యాదుదారులు, అనుమానితులు.. ఇద్దరూ ఎస్సీలే కాబట్టి సమస్య జటిలం కాలేదు. పోలీసులు, గ్రామస్థుల కథనం మేరకు ఈ సంఘటనకు నేపథ్య వివరాలు ఇలా ఉన్నాయి. పాతపాళ్యం హరిజనవాడలో చర్చికి దారి సమస్య ఉంది. దళితవాడకు చెందిన త్యాగరాజు పొలం పక్కనున్న మూడు అడుగుల మార్గంలో గ్రామస్తులు చర్చికి వెళ్తూ వస్తూ ఉండేవారు. తన పొలంలో నుంచి మరో మూడు అడుగుల దారి ఇవ్వాలని త్యాగరాజును గ్రామస్తులు కోరారు. దానికి ఆయన అంగీకరించలేదు. దీంతో వారు 2020లో త్యాగరాజు పొలానికి వెళ్లే మార్గంలో అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. త్యాగరాజు పోలీసులకు ఫిర్యాదు చేసి, కోర్టును ఆశ్రయించారు. కోర్టు.. గ్రామస్తులకు పెనాల్టీ వేసి, విగ్రహం గ్రామకంఠం భూమిలో ఉందని.. దాన్ని తొలగించకూడదని చెప్పింది. అయితే త్యాగరాజు కొన్న పొలంలోకి ట్రాక్టరు కూడా వెళ్లే అవకాశం లేకుండా పోయింది. ఇది ఇరువర్గాల నడుమ వివాదంగానే రగులుతూ ఉన్న నేపథ్యంలో ఆదివారం రాత్రి అంబేడ్కర్ విగ్రహాన్ని గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. దీనిపై పోలీసులకు గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. కార్వేటినగరం సీఐ హనుమంతప్ప, ఎస్ఆర్‌పురం ఎస్ఐ సుమన్ సంఘటనా స్థలాన్ని పరిశీలించి, గ్రామంలో విచారించారు. గ్రామస్తులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు 'గుర్తు తెలియని వ్యక్తులు' అని కేసు నమోదు చేశారు. అనుమానం ఉన్న త్యాగరాజు కుమారుడు జయరామ్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. కాగా, విగ్రహాన్ని ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని పోలీసులను ఆదేశించినట్లు జీడీ నెల్లూరు ఎమ్మెల్యే థామస్ పేర్కొన్నారు. నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి, మాల కార్పొరేషన్ డైరెక్టర్ పొన్న యుగంధర్ సంఘటనా స్థలాన్ని పరిశీలించి.. నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

వానకు నేలకొరిగిన పంటలు




నేతిగుట్లపల్లె వద్ద నేలకొరిగిన వరిపైరు- భీమగానిపల్లె వద్ద నేలకొరిగిన బీర పంట

పుంగనూరు రూరల్, డిసెంబరు2(ఆంధ్రజ్యోతి): తుపాన్ ప్రభావంతో సోమవారం కూడా జడివాన వీడకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడగా మరోవైపు పంటలు దెబ్బతిన్నాయి. మూడు రోజులుగా కురుసున్న వర్షాల వల్ల పుంగనూరు మండలంలో బీర, టమోటా, బంగాళదుంప. పూలతోటలు, బీన్స్, కాలీఫ్లవర్, వరి పంటలు నేలకొరిగి తీవ్ర నష్టం వాటిల్లింది. పుంగనూరు మండలంలో వర్షం వల్ల జరిగిన పంట నష్టాలను సోమవారం వ్యవసాయ, ఉద్యానవనశాఖ అధికారులు పరిశీలించి అంచనాలు వేశారు. మండలంలోని భీమగానిపల్లె వద్ద రెండు ఎకరాల బీరకాయ పంట నేలకొరిగింది. బంగాళా దుంప 22ఎకరాలు, టమోటా 34ఎకరాలు, 4 ఎకరాలు పువ్వులు సాగు, మూడు ఎకరాలు బీన్స్, 8 ఎకరాలు ఖాళీ ఫ్లవర్ పంటలు నష్టం జరిగినట్లు హార్టికల్చర్ అధికారి వరప్రసాద్ తెలిపారు. అలాగే మండల పరిధిలో దాదాపు 288 హెక్టార్లు వరి పంట నేలకొరిగి వర్షపునీరు నిల్వతో పంటలు దెబ్బతిన్నాయని వ్యవసాయశాఖాధికారి జ్యోతి తెలిపారు.

యువతకు సరైన గుర్తింపునివ్వాలి



లోకేశ్‌ను కలిసిన కుప్పం యువత నాయకులు

కుప్పం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): కుప్పం నియోజక వర్గంలోని యువతకు సరైన గుర్తింపు నివ్వాలని ముఖ్యమంత్రి చంద్రబాబును. విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్‌ను నియోజక వర్గంలోని టీడీపీ యువ నాయకులు కోరారు. రాజధాని అమరావతిలోని ఉండవల్లి నివాసంలో సోమ వారం ఏఎంసీ మాజీ ఛైర్మన్ సత్యేంద్రశేఖర్, మాజీ ఎంపీపీ డాక్టర్ వెంకటేశ్, రాష్ట్ర తెలుగు యువత కార్యనిర్వాహక కార్యదర్శి చెక్కునత్తం మణి, నియోకవర్గ టీడీపీ బీసీ సెల్ అధ్యక్షుడు మురళి, తెలుగు యువత అధ్యక్షుడు సుబ్బు, బాలు, మంజు, కర్లగట్టు పార్టీ అధ్యక్షుడు గిరిధర్ ముఖ్యమంత్రిని కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసీపీ అరాచకాలు పెచ్చుమీరిన ప్రతికూల పరిస్థితుల్లో సైతం గత ఎన్నికల్లో తామంతా పార్టీకోసం కష్టపడి పనిచేశామని చెప్పారు. దీనిపై చంద్రబాబు. లోకేశ్‌లు మాట్లాడుతూ పార్టీలో కష్టపడిన వారికి తప్పకుండా తగిన గుర్తింపు ఉంటుందని హామీ ఇచ్చారు.

టీడీపీ నాయకుడికి ఎమ్మెల్యే అమర్ నివాళులు



గంగవరం, డిసెంబరు2 (ఆంధ్రజ్యోతి): పలమనేరు మార్కెట్ కమిటీ మాజీ అధ్యక్షులు, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయ కులు కీలపల్లి శ్రీనివాసులురెడ్డికి ఎమ్మెల్యే అమరనాథరెడ్డి నివాళులర్పించారు. శ్రీనివా సులురెడ్డి కొంతకాలంగా అనారోగ్యంతో బాధ పడుతూ సోమవారం మృతిచెందారు. విష యం తెలుసుకొన్న ఎమ్మెల్యే టీడీపీ నాయకులతో కలిసి గంగవరం మండలం కీలపల్లి గ్రామానికి వెళ్లి శ్రీనివాసులు రెడ్డి మృతదేహానికి నివాళులు అర్పించారు. ఆయన కుటుంబసభ్యులను పరామర్శించారు. ఎమ్మెల్యేతో పాటు గంగవరం మండల టీడీపీ అధ్యక్షులు సోమశేఖర్‌గౌడు, ప్రధాన కార్యదర్శి ప్రతాపరెడ్డి, సీనియర్ నాయకులు వెంకటరమణారెడ్డి, మొగిలిరెడ్డి, మునస్వామి రెడ్డి తదితరులు ఉన్నారు.

మొక్కలు నాటుదాం..కాలుష్యం నుంచి బయటపడుదాం



పలమనేరు, డిసెంబరు2 (ఆంధ్రజ్యోతి) : కాలుష్య కోరలనుంచి బయట పడేందుకు ప్రతిఒక్కరూ మొక్కలను విస్తారంగా నాటి సంరక్షించాలని ప్రకృతి సంస్థ కన్వీనర్ మల్లిచెట్ల దేవేంద్ర పిలుపునిచ్చారు. సోమవారం కాలుష్య నివారణ దినోత్సవం సందర్భంగా ఆయన విద్యార్థులకు పలురకాల మొక్కలను పంపిణీ చేశారు. వాటిని తమ ఇళ్లవద్ద నాటి సంరక్షించాలని కోరారు. మొక్కల వలన కలిగే ప్రయోజనాలు గురించి విద్యార్థులకు వివరించారు.

ఇంటర్ వర్శిటీ చెస్ చాంపియన్‌షిప్‌కు కేడీసీ విద్యార్థిని



సుచిత్రను అభినందిస్తున్న వైస్ చైర్మన్ సాగర్‌రాజ్ తదితరులు

కుప్పం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): బీసీఎన్ విద్యా సంస్థలకు అనుబంధమైన కుప్పం డిగ్రీ కళాశాలలో బీఎస్సీ మూడవ సంవత్సరం చదువుతున్న విద్యార్థిని ఆర్ఎస్. సుచిత్ర ఇటీవల తిరుపతిలో జరిగిన ఇంటర్ కాలేజియేట్ చెస్ పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబరిచి ఎస్వీయూ జట్టుకు ఎంపికయ్యారు. ఆమె ఈనెల 6వ తేదీ నుంచి విశాఖపట్టణంలోని గీతం యూని వర్శిటీలో జరిగే సౌత్‌జోన్ ఇంటర్ యూనివర్శిటీ చెస్ చాంపియన్‌షిప్‌లో పాల్గొననున్నారు. సుచిత్రను కళాశాల ఛైర్‌పర్సన్ శాంతా నాగరాజ్, వైస్ ఛైర్మన్ సాగర్‌రాజ్, ప్రిన్సిపాల్ సుధారాణి ప్రశంసించారు. ఆమెకు శిక్షణ ఇచ్చిన ఫిజికల్ డైరెక్టర్ సుధాకర్‌ను అభినందించారు.

సీడ్ సర్వేపై ఎమ్మెల్యేకు ఫిర్యాదు



సీడ్ సర్వేపై ఫిర్యాదు చేస్తున్న మాజీ ఎంపీపీ మురళి, పూసల రవి

పలమనేరు, డిసెంబరు2 (ఆంధ్రజ్యోతి): పెద్దపంజాణిలో సీడ్‌సర్వేపై అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆ మండల మాజీ ఎంపీపీ మురళి, సంచార జాతుల రాష్ట్ర అధ్యక్షులు పూసల రవి ఎమ్మెల్యే అమరనాథరెడ్డికి ఫిర్యాదు చేశారు. ఇటీవల కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు సంచార జాతులను సీడ్ సర్వేద్వారా గుర్తించి నివేదికలు సిద్ధం చేస్తున్నాయి. ఈ బాధ్యతలు నిర్వర్తిస్తున్న పెద్దపంజాణి ఎంపీడీవో మొక్కుబడిగా సర్వే నిర్వహిస్తున్నారని, ఇందువలన సంచార జాతులకు పథకాలు అందే అవకాశాలు తగ్గిపోతాయని ఆందోళన వ్యక్తం చేశారు. స్పందించిన ఎమ్మెల్యే వెంటనే ఎంపీడీఓకు ఫోన్ చేశారు. సంచార జాతుల గుర్తింపు కోసం ఆ జాతుల సంఘ నాయకులతో మాట్లాడి సమాచారం సేకరించుకొని సంచార జాతులకు పథకాలు అందేలా పక్కాగా సర్వే చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంచార జాతుల సంఘ నాయకులు వెంకటరమణ, రెడ్డెప్ప, నాగభూషణం, వేణు, రమేష్, ఉమా, శంకరమ్మ, సుబ్బు పాల్గొన్నారు.

జనసేనలో చేరిన ముస్లిం మైనారిటీలు



వేణుగోపాల్‌రెడ్డి సమక్షంలో జనసేనలో చేరిన ముస్లింలు

పుంగనూరు రూరల్, డిసెంబరు2(ఆంధ్ర జ్యోతి): డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ ఆలోచనలను గుర్తించి ముస్లిం మైనార్టీలు జనసేన పార్టీ వైపు మొగ్గు చూపుతున్నట్లు ఆ పార్టీ నాయకుడు ఎన్.వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. సోమవారం మండలంలోని చదళ్లలోని ఆయన ఇంట్లో చౌడేపల్లె మండలం దాదేపల్లెకు చెందిన 60 కుటుంబాల ముస్లిం, మైనార్టీలు జనసేన పార్టీలో చేరారు. ఈ సందర్భంగా పలువురు ముస్లింలు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో మైనార్టీలకు మంచి గుర్తింపు ఇస్తుందని నమ్మకం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు శివకుమార్‌రెడ్డి, విరూపాక్షి, నరేంద్రరెడ్డి, పగడాల రమణ, చిన్నారాయల్, చైతన్య రాయల్, జావీద్, ఫరీద్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

పలమనేరులో 39 వేలు దాటిన టీడీపీ సభ్యత్వాలు

12,144 సభ్యత్వాలతో వి.కోట నెంబర్ వన్

వి.కోట, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): పలమనేరు నియోజక వర్గంలో 39 వేల తెలుగుదేశం పార్టీ సభ్యత్వాలు నమోదైనట్లు పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి తెలిపారు. నియోజకవర్గంలో వి.కోట మండలం 12,144 సభ్య త్వాలను నమోదు చేసి అగ్ర స్థానంలో నిలిచిందన్నారు. మండల పరిధిలోని 18 గ్రామ పంచాయతీల నుంచి సెగ్మెంట్‌లోనే అత్యధికంగా సభ్యత్వాలు నమోదు కావడం పట్ల మండల పార్టీ అధ్యక్షులు రంగనాథ్, ప్రధాన కార్యదర్శి ఈశ్వర్‌లుహర్షం వ్యక్తం చేశారు. నియోజక వర్గంలో ఇప్పటివరకు 39 వేల సభ్యత్వాలు నమోదు కాగా అందులో సెగ్మెంట్‌లో అత్యధికంగా వి.కోట 69,164 ఓట్లకు గాను 12,411 వేలు సభ్యత్వాలతో మొదటి స్థానంలో నిలిచింది. బైరెడ్డిపల్లె 43,166 ఓట్లకు 8360 సభ్యత్వాలతో ద్వితీయ స్థానం, పెద్దపంజాణి 45,714 ఓట్లకు 7356 సభ్యత్వాలతో తృతీయ స్థానంలో నిలిచాయి. గంగవరం 43,582 ఓట్లకు 5163 సభ్యత్వాలతో నాల్గవ స్థానం, పలమనేరు అర్బన్ 40,288 ఓట్లకు 4053 ఐదవ స్థానం, రూరల్ 24,630 ఓట్లకు 1639 ఆరవ స్థానంలో నిలిచాయి. పార్టీ నాయకత్వం సభ్యత్వ నమోదుపై మరింత చురుగ్గా ఉండాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు.

మొరవపోతున్న వెంకట్రమణ సముద్రం చెరువు



రొంపిచెర్ల, డిసెంబరు2 (ఆంధ్రజ్యోతి): మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు తలకోన అటవీ ప్రాంతం నుంచి వస్తున్న జలాలతో గాజులేరు జోరుగా ప్రవహిస్తోంది. ఆ నీరు మండలం లోని గానుగచింతలోకి వస్తోంది. దీంతో చిన్న చిన్న చెరువులు, కుంటలలోకి నీరు చేరింది. ఈ క్రమంలోనే వెంకట్రమణ సముద్రం చెరువు (ఏటిచెరువు) గాజులేరు నీటితో నిండి సోమవారం మొరవపోయింది. ఆయకట్టు రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

తుపాను ఆగే వరకు రైతులు అప్రమత్తంగా ఉండాలి

చౌడేపల్లె, డిసెంబరు2 (ఆంధ్రజ్యోతి): తుపాను ఆగే వరకు రైతులు అప్రమత్తంగా ఉండాలని ఏవో జ్యోతి పేర్కొన్నారు. సోమవారం ఆమె మాట్లాడుతూ వర్షం ఆగే వరకు రైతులు వరి కోతలు చేపట్టకూడదన్నారు. ఇప్పటికే వరి కోతలు చేసిన రైతులు పంట నూర్పిడిచేసి సురక్షితమైన ప్రాంతంలో భద్రపరుచు కోవాలన్నారు. నీట మునిగిన వరి పంటలోని నీటిని వెలుపలకు పంపాలన్నారు. నీటిలో మునిగి, తడిచిన వరి పంటలో లీటరు నీటిలో 5గ్రాముల ఉప్పు ద్రావణాన్ని కలిపి పిచికారి చేయటం వలన వరిలో మొలకలు రాకుండా ఉంటాయని పేర్కొన్నారు. పంట నష్టపోయిన రైతుల వివరాలు రైతు సేవాకేంద్రాల ద్వారా నమోదు చేసి ఉన్నతాధికారులకు పంపనున్నట్లు తెలిపారు.

వర్షంలోనూ విద్యుత్ స్తంభాల పునరుద్ధరణ

సోమల, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): సోమల మండలంలో మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పలు చోట్ల విద్యుత్ స్తంభాలు నేలవాలాయి. ఈక్రమంలోనే ఏఈఈ మహేంద్రరెడ్డి చొరవ తీసుకుని ట్రాన్స్‌కో సిబ్బందితో కలసి కూలిన విద్యుత్ స్తంభాల పునరుద్ధరణ చర్యలు చేట్టారు. విద్యుత్ వైర్లపై కూలిన వృక్షాలను తొలగించి విద్యుత్ సమస్యలను పరిష్కరించడానికి చర్యలు చేపట్టారు. పెద్దఉప్పరపల్లెలో ఎల్ఐ చిన్నప్పరెడ్డి, లైన్‌మెన్ విష్ణువర్ధన్‌రెడ్డి, నవీన్ రాయల్ పాల్గొన్నారు. నడింపల్లె, సోమల పంచాయతీల్లో జ్యోతిరెడ్డి పర్యవేక్షిస్తున్నారు.

కాశీవిశ్వేశ్వరుడికి విశేష పూజలు

రామకుప్పం, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): రామకుప్పంలోని అన్నపూర్ణ సమేత కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో సోమవారం విశేష పూజలు నిర్వహించారు. ఉదయం అమ్మవారికి, స్వామివారికి ప్రత్యేక అభిషేక పూజలు నిర్వహించి, విశేష అలంకరణలు చేశారు. భక్తులు దేవతామూర్తులను దర్శించుకున్నారు.

మొరవపోతున్న వ్యాసప్ప చెరువు

సదుం, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని తిమ్మానాయుడుపల్లె పంచాయతీ పరిధిలో ఉన్న వ్యాసప్ప చెరువు మొరవపోతోంది. సోమల మండల పరిధిలోని సోమప్ప చెరువు మొరవనీరు వ్యాసప్ప చెరువుకు చేరడంతో పూర్తిగా నిండి మొరవ సాగుతోంది. ఈ మొరవ నీరు అదే పంచాయతీ పరిధిలోని అగ్రహారం వద్దనున్న చిక్కరాయచెరువు, బుడ్డారెడ్డిగారి చెరువులకు జోరుగా సాగుతోంది. ఇలాగే మరో రెండు రోజులు నీరు సాగితే ఈ రెండు చెరువులు కూడా మొరవ పోతాయని సర్పంచ్ మురళీధర్ రెడ్డి తెలిపారు.

వానకు కూలిన ఆలయం



కుప్పం రూరల్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తమిళనాడు సరిహద్దుల్లో గల దేవరాజపురం ఎస్సీ కాలనీలో గల ముత్తుమారమ్మ ఆలయం ఫెంగల్ తుపాను దెబ్బకు కూలిపోయింది. పైకప్పుతో పాటు కాంక్రీటు స్తంభాలు నేల కూలాయి. ఆలయ పునరుద్ధరణకు ప్రభుత్వం సాయం చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఎమ్మెల్యేను కలిసిన చుడా ఛైర్‌పర్సన్

పలమనేరు, డిసెంబరు2 (ఆంధ్రజ్యోతి) : పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డిని సోమవారం చిత్తూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఛైర్‌పర్సన్ కటారి హేమలత సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. చుడా ఛైర్‌పర్సన్‌గా ప్రమాణ స్వీకారం చేశాక తొలిసారి పలమనేరు టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే అమరనాథ రెడ్డిని కలిశారు. శాలువ కప్పి సన్మానించారు.

టమోటాకు వాతావరణ ఆధారిత బీమా వర్తింపు

కుప్పం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): టమోటా పంటను రబీ సీజన్‌లో నోటిఫైడు పంటగా గుర్తించినట్లు కుప్పం మండల ఉద్యానశాఖాధికారి డింపు ప్రియ ఒక ప్రకటనలో తెలిపారు. ఫలితంగా ఈ పంటకు వాతారణ ఆధారిత బీమా వర్తిస్తుందని పేర్కొన్నారు. ప్రీమియం రైతులు ఎకరాకు రూ.1,250 చెల్లిస్తే, రూ.25 వేల పంట బీమాకు అర్హులవుతారని వివరించారు. ఈ నెల 15లోగా ప్రీమియం చెల్లించాలని తెలియజేశారు. అక్టోబరు 1వ తేదీ నుంచి టమోటా పంట నాటి రైతులందరూ ఈ బీమా పథకానికి అర్హులేనని పేర్కొన్నారు.

వర్షానికి దెబ్బతిన్న టమోటా

సోమల, డిసెంబరు 2:(ఆంధ్రజ్యోతి): సోమల మండలంలో మూడు రోజులుగా విడవ కుండా వర్షం కురిసింది. ఈ వర్షాలకు వరి, టమోటా తోటలు దెబ్బ తిన్నాయి. సోమల మండలంలో 400 ఎకరాల్లో టమోటా సాగులో ఉంది. మూడు రోజులుగా కురిసిన వర్షంతో ఆకులు రాలిపోయాయి. చీడపీడలు వ్యాప్తి చెంది కాయలపై నల్లని మచ్చలు, పగళ్లు వచ్చాయి. ఈ పంటను మార్కెట్‌కు తరలించ లేక పొలాల వద్దనే కొందరు రైతులు వదిలేశారు. ప్రస్తుతం 15కిలోల బాక్సు రూ. 400 నుంచి రూ. 600 పలుకుతోంది. ధర ఆశాజనకంగా ఉండడంతో పంటను కోయలేక వదులుకోలేక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షంతో దెబ్బతిన్న టమోటా పంటకు ప్రభుత్వం నష్ట పరిహారం అందించాలని రైతులు కోరుతున్నారు.

ఆగని కోతలు

కరకమంద, సోమల, పెద్దఉప్పరపల్లెలో కొద్ది రోజులుగా కోతలు ప్రారంభమైనాయి. వర్షాలకు టమోటా తోటలు దెబ్బతిన్నాయి. అయినా ఉన్న కాయలను వదలలేక కోతలు చేస్తున్నారు. కోతలు చేసిన టమోటాలను పలమనేరు, కోలారు, పుంగనూరు మార్కెట్లకు తరలిస్తున్నారు.





కరకమందలో వర్షంలోనే టమోటా కోతలు చేస్తున్న కూలీలు, వర్షంతో నేల వాలిన వరి పంట, దెబ్బ తిన్న టమోటా తోట

వరి రైతును ఆదుకుంటాం: ఏడీఏ

సోమల, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాలతో దెబ్బతిన్న వరి రైతులను ఆదుకుంటామని మండల ప్రత్యేక అధికారి, పుంగనూరు ఏడీఏ శివకుమార్ రాజు తెలిపారు. సోమవారం సోమల మండలంలోని సోమల, కందూరు, పొదలకుంట్లపల్లె, తమ్మినాయనపల్లె తదితర పంచాయతీల్లో వర్షంతో దెబ్బ తిన్న వరి పొలాలను రైతు సేవా కేంద్రం అధికారులతో కలసి ఆయన పరిశీలించారు. పలు చోట్ల నీట మునిగిన వరి, టమోటా, కూరగాయ తోటలను పరిశీలించారు. నష్ట పోయిన రైతులు తమ పరిధిలోని రైతు సేవా కేంద్రాల్లో దెబ్బ తిన్నపంటల వివరాలను నమోదు చేయించాలన్నారు. 200 హెక్టార్లలో వరి పంట నష్టం జరిగినట్లు అంచనా వేసినట్లు చెప్పారు. తడిసిన వరి పంటలపై 5శాతం ఉప్పు ద్రావణాన్ని పిచికారీ చేసుకోవడం వల్ల మొలక రాకుండా ఉంటుందన్నారు. కాగా పుంగనూరు డివిజన్‌లో 500 హెక్టార్ల వరి దెబ్బతిని నేలకొరిగిందన్నారు. ఆయన వెంట ఏవో సుధాకర్, రైతు సేవా కేంద్రం ఉద్యోగులు పాల్గొన్నారు.

టమోటా, మిరప, వేరుశనగ రైతులకు ఫెంగల్ దెబ్బ



దెబ్బతిన్న టమోట తోట

రొంపిచెర్ల, డిసెంబరు2 (ఆంధ్రజ్యోతి): తుపాను ప్రభావంతో ఈదురు గాలుల వర్షానికి మండలంలోని వేరుశెనగ, టమోట, మిరప పంటలకు నష్టం వాటిల్లింది. బండకిందపల్లెకు చెందిన రెడ్డెప్పరెడ్డి, బోణంవారిపల్లె సి.రామచంద్ర, ఎస్.రామచంద్ర, హనుమంత రాయని పేట కె.రామయ్య వారం క్రితం వేరుశనగ విత్తనాలు విత్తారు. విత్తనాలు మొలకలు వచ్చే సమయానికి వర్షం రావడంతో నీటి శాతం పెరిగి మొలకుల రాకుండా విత్తనాలు కుళ్లిపోయే పరిస్థితులు ఉన్నాయి. బండకిందపల్లె హరిజనవాడకు చెందిన లక్ష్మయ్య, అనంతమ్మ, మట్లోళ్ల పల్లెలో అరుణమ్మలు, శాంతమ్మ, టమోట, మిరప పంటలు దెబ్బతిన్నాయి. దెబ్బ తిన్న పంటలను ఉద్యానవన శాఖ అధికారి నరసింహులు పరిశీలించారు. కాగా వరి కోతలు ముందుగా చేసుకోవడంతో ఎలాంటి నష్టాలు సంభవించలేదని ఏవో సుధారాణి సోమవారం తెలిపారు.

360 ఎకరాల్లో వరి పంట నష్టం



వెంగళపల్లెలో నీట మునిగిన వరి పంట

చౌడేపల్లె, డిసెంబరు 2: (ఆంధ్రజ్యోతి): ఫెంగల్ తుపాను ప్రభావంతో మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండలంలో 360 ఎకరాలలో వరి పంటలు దెబ్బతిన్నట్లు ఏవో జ్యోతి పేర్కొన్నారు. సోమవారం ఆమె మాట్లాడుతూ మండలంలోని దిగువపల్లె, పరికిదొన, గడ్డంవారిపల్లె, కొండామర్రి, శెట్టిపేట, వెంగళపల్లె పంచాయతీలలో 360 ఎకరాలలో వరి పంటలు నేలకొరిగినట్లు తెలిపారు. అలాగే కాగతి, దిగువపల్లె పంచాయతీలలో 18 ఎకరాలలో టమోటా పంటలు, పరికిదొన పంచాయతీలో 5 ఎకరాలలో బీన్స్, చారాల, దిగువపల్లె పంచాయతీలలో 5 ఎకరాల వంకాయ పంటలు దెబ్బతిన్నట్లు ఉద్యానవన శాఖ అధికారి సంతోషికుమారి తెలిపారు. కాగా మండలంలో ఆదివారం సాయంత్రం నుంచి సోమవారం సాయంత్రం వరకు 51.4 ఎంఎం వర్ష పాతం కురిసినట్లు తహసీల్దార్ హనుమంతు పేర్కొన్నారు.

ఆకాశన్నంటుతున్న కూరగాయల ధరలు

రామకుప్పం, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): ఫెంగల్ తుపాను నేపథ్యంలో మార్కెట్లో కూరగాయల ధరలు అమాంతం ఆకాశనంటుతున్నాయి. ఎడతెరపి లేని ముసురు కారణంగా తోటల్లో కాయగూరలు ఎక్కువ శాతం పాడైపోవడం వల్ల ఈ పరిస్థితి తలెత్తింది. మొన్నటి వరకు కిలో రూ.30లోపు ఉన్న కాయగూరలు ధరలు దాదాపు రెట్టింపయ్యాయి. బహిరంగ మార్కెట్లో కిలో టమోటా ధర రూ.50 నుంచి రూ.65వరకు, బీన్స్ రూ.40 నుంచి రూ.60వరకు, బంగాళదుంపలు కిలో రూ.50 నుంచి రూ.80 వరకు పలుకుతున్నాయి. క్యారెట్, బీట్‌రుట్, ముల్లంగి ధరలు కూడా అలాగే ఉన్నాయి. కాగా మొన్నటి వరకు కట్ట కొత్తిమీర రూ.10 ఉండగా సోమవారం ఒక్కసారిగా పదిరెట్లు పెరిగింది. హైబ్రీడ్ కొత్తిమీర కట్ట రూ.50 నుంచి, రూ.60కి పెరగగా, నాటి కొత్తిమీర కట్ట రూ.70 నుంచి రూ.100కు పెరిగింది. ఈ పరిస్థితుల్లో ఏం కొనేటట్టు లేదు, తినేటట్టు లేదంటూ సాధారణ జనం నిట్టూరుస్తున్నారు.

నగదు, వెండి నాణేల చోరీ

పలమనేరు, డిసెంబరు2(ఆంధ్రజ్యోతి) : పలమనేరు రంగమహల్ సినిమా థియేటర్ సమీపంలో ఆదివారం రాత్రి పుహలేంది అనే వ్యక్తికి చెందిన దుకాణంలో దొంగలు పడ్డారు. దుకాణానికి ఉన్న షట్టరు తీసి సుమారు రూ. 30 వేలు నగదు, కొన్ని వెండి నాణేలు దొంగిలించుకు పోయారు. దుకాణం వెలుపల ఉన్న సీసీ కెమెరాను దొంగలు పగులగొట్టి లోనికి ప్రవేశించారు. ముఖం కనిపించకుండా దుస్తులు ధరించి ఉన్నట్లు దుకాణం లోపల ఉన్న సీసీ కెమెరాలో రికార్డు అయింది. చోరీ సంఘటనపై పుహలేంది పలమనేరు పోలీసులకు సోమవారం ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పూల మొక్కలు పూతదశలో వాడిపోకుండా చూసుకోండి



పూల రైతులకు సూచనలిస్తున్న అధికారులు

సదుం, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): పూల తోటల్లో యాజమాన్య పద్ధతులపై జిల్లా సహాయ వ్యవసాయ సంచాలకులు నాగపద్మిని, ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్త డా.సంధ్యారాణి పూల రైతులకు అవగాహన కల్పించారు. బలిజపల్లెలోని రైతులు సాగు చేస్తున్న పూల తోటలను వారు పరిశీలించారు. గతంలో జరిగిన 'పొలం పిలుస్తోంది' కార్యక్రమంలో బలిజపల్లె రైతులు పూత దశలోనే మొక్కలు వాడిపోతున్నాయని వ్యవసాయ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఆ మేరకు వారు సోమవారం బలిజపల్లెలో పర్యటించారు. పూల మొక్కలు నాటక మునుపే కాపర్ యాక్సీక్లోరైడ్ లేదా ట్రైకోడెర్మా మందులు ఆవుల ఎరువులో కలిపి పొలంలో చల్లాలని సూచించారు. అలాగే కాపర్ టాక్సీక్లోరైడ్ లీటరు నీటిలో మూడు గ్రాములు కలిపి పిచికారి చేయడం వల్ల తెగులును నివారించవచ్చునని వివరించారు. తరచూ పంట మార్పిడి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి హరిప్రసాద్, వీహెచ్ఏ ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

చికెన్ సెంటర్ నిర్వాహకుడిపై చేయి చేసుకున్న ఏఎస్ఐ

పుంగనూరు రూరల్, డిసెంబరు2(ఆంధ్రజ్యోతి): పుంగనూరులోని ఓ చికెన్ సెంటర్ నిర్వాహకుడిపై ఏఎస్ఐ చేయిచేసుకున్నాడని స్థానిక ఎస్‌డీపీఐ నాయకులు సీఐ శ్రీనివాసులుకు ఫిర్యాదు చేశారు. వారి కథనం మేరకు.. స్థానిక కొత్తపేటలో మహబూబ్ బాషా చికెన్ సెంటర్ నిర్వహిస్తున్నాడు. ఇతడు కోళ్లవ్యాపారి సిద్ధిక్ వద్ద దాదాపు రూ.2లక్షలకు కోళ్లు అప్పుగా తీసుకున్నాడు. డబ్బు ఇవ్వాలని సిద్ధిక్ అతడిపై ఒత్తిడిచేశాడు. ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. దీంతో సిద్ధిక్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఆ మేరకు ఏఎస్ఐ దామోదర్ చికెన్ సెంటర్ నిర్వాహకుడైన మహబూబ్ బాషాను స్టేషన్‌కు పిలిపించాడు. విచారణ చేస్తూ చెంపపై కొట్టి దుర్భాషలాడాడు.

గడ్డివామి కూలి ఆవు, రెండు దూడల మృతి



రామకుప్పం, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): రామకుప్పం మండలం పంద్యాలమడుగు పంచాయతీ కావలిమడుగులో గడ్డివామి కూలి ఆవు, రెండు దూడలు మృతి చెందాయి. ఆదివారం రాత్రి ఇక్కడ గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. దీంతో సోమవారం తెల్లారి జామున ఆనందకుమార్‌గౌడుకు చెందిన గడ్డివామి కుప్పకూలింది. వామి కింద ఉన్న ఓ ఆవు, రెండు దూడలు అక్కడికక్కడే మృతి చెందాయి. మరో ఆవుకు తీవ్రగాయాలయ్యాయి. చనిపోయిన ఆవు, దూడల విలువ సుమారు రూ.1లక్ష ఉంటుందని బాధితుడు వాపోయాడు. పశుసంవర్ధక శాఖ అధికారులు ఆవు, దూడలకు పోస్టుమార్టం నిర్వహించారు. రైతుకు కలిగిన నష్టంపై కలెక్టరుకు నివేదిస్తామని వారు తెలిపారు.

17న పెన్షనర్స్ డే

పుంగనూరు, డిసెంబరు2(ఆంధ్రజ్యోతి): ఈనెల 17వ తేదీ పుంగనూరు విశ్రాంత ఉద్యోగుల సంక్షేమ భవన్‌లో ఘనంగా పెన్షనర్స్ డేను జరపనున్నట్లు సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చెంగారెడ్డి, రామకృష్ణారెడ్డి వెల్లడించారు. సోమవారం స్థానిక విశ్రాంత ఉద్యోగుల భవన్‌లో జరిగిన నెలవారి సమావేశంలో వారు మాట్లాడారు. ప్రభుత్వం వద్ద పెండింగ్‌లో ఉన్న విశ్రాంత ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ సమావేశంలో సంఘ నాయకులు భరత్‌భూషణ్, కేశవరెడ్డి, సుబ్రహ్మణ్యం, గంగులమ్మ, లీలావతమ్మ, ద్వారకమ్మ, నారాయణరెడ్డి పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన ఉండాలి

రొంపిచెర్ల, డిసెంబరు2 (ఆంధ్రజ్యోతి): ఎయిడ్స్‌పై అవగాహన ఉండాలని డాక్టరు దినేష్ కుమార్, డాక్టరు వినయ్ కోరారు. రొంపిచెర్లలో సోమవారం ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీ నిర్వ హించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఈ రాజేశ్వరి, సూపర్‌వైజర్ పంకజాక్షి, ఆరోగ్య ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

చిత్తూరు
జీడీ నెల్లూరు/పూతలపట్టు/నగరి

సభ్యత్వ నమోదు వేగవంతం చేయండి


మాట్లాడుతున్న సుబ్రహ్మణ్యం, చెన్నకేశవులు నాయుడు

గుడిపాల, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి):మండలంలో టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని మండల టీడీపీ అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం నాయుడు, సీనియర్ నేత గురజాల చెన్నకేశవులు నాయుడులు కోరారు. సోమవారం మండల టీడీపీ కార్యాలయంలో కార్యకర్తలతో మాట్లాడుతూ మండలంలో 35వేల మందితో సభ్యత్వ నమోదు చేయాల్సి ఉంటే కేవలం 10వేల మందిని చేయించారన్నారు. కార్యకర్తకు సభ్యత్వ నమోదు ధీమా వంటిదన్నారు. రానున్న రోజుల్లో లక్ష్యాన్ని చేరుకోవాలన్నారు. రాష్ట్ర తెలుగు యువత ఉపాధ్యక్షులు హేమాద్రి నాయుడు, నేతలు మధుసూదన్ నాయుడు, కిట్టు, శివ, శివలింగారెడ్డి, దొరబాబు, అర్జున్, చందు, జయచంద్ర పాల్గొన్నారు.

సకాలంలో అర్జీలకు పరిష్కారం: కమిషనర్

చిత్తూరు అర్బన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్) ద్వారా అందే వినతులను సకాలంలో పరిష్కరించాలని కమిషనర్ నరసింహ ప్రసాద్ అధికారులను ఆదేశించారు. సోమవారం నగర పాలక కార్యాలయంలో పీజీఆర్ఎస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. పలు సమస్యలపై కమిషనర్ అక్కడికక్కడే అధికారులతో మాట్లాడి పరిష్కారానికి చర్యలు చేపట్టారు. తాజా ఫిర్యాదులపై క్షేత్రస్థాయిలో పరిశీలించి బాధితులకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో సహాయక కమిషనర్ ప్రసాద్, ఎంహెచ్‌వో డాక్టర్ లోకేష్, ఎంఈ వెంకట్రామిరెడ్డి ఇతర అధికారులు పాల్గొన్నారు.

తవణంపల్లెలో ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీ



తవణంపల్లె, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో సోమవారం వైద్య సిబ్బంది ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారులు మాట్లాడుతూ సమాజ భాగస్వామ్యంతోనే ఎయిడ్స్ నియంత్రణ సాధ్యమన్నారు. ఈ వ్యాధిపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలన్నారు. గర్భిణి విధిగా హెచ్ఐవి పరీక్షలు చేయించుకోవాలన్నారు. వైద్యాధికారులు మోహనవేలు, వినయ్‌కుమార్, కేశవనారాయణ, సీహెచ్‌వోలు, సిబ్బంది ఆశ వర్కర్లు పాల్గొన్నారు. ●నగరి:ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్, రెడ్‌రిబ్బన్ క్లబ్ సంయుక్తంగా ఎయిడ్స్‌కు ఎయిడ్స్ అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వేణుగోపాల్, ఇందిరా ప్రియదర్శిని, స్వాతి, భాస్కర్‌రాజు, సుబ్రమణ్యం, వరలక్ష్మి పాల్గొన్నారు.

కూలిన ఇళ్లు: ఆదుకోవాలని బాధితుల వినతి



యాదమరి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మూడురోజులుగా ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలకు రెండు మట్టి ఇళ్ళు కూలిపోయాయని రెవెన్యూ అధికారులకు బాధితులు ఫిర్యాదు చేశారు. చిన్నంపల్లిలో వృద్ధురాలు నాయగంకు చెందిన ఇల్లు, తెల్లరాళ్ళపల్లిలో ప్రభాకర్ మట్టిగోడల రేకుల ఇల్లు వర్షాల ధాటికి కూలిపోయాయి. తమను ఆదుకోవాలని వారు తహసీల్దార్ పార్థసారథికి వినతిపత్రం అందజేశారు. తహసీల్దార్ సానుకూలంగా స్పందించారు.

కూలిన ఇంటిని చూపుతున్న నాయగం

వరద ప్రాంతాల్లో తక్షణ చర్యలు తీసుకోండి: టీడీపీ


కమిషనర్‌తో మాట్లాడుతున్న నాయకులు

నగరి,డిసెంబరు2(ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీ పరిధిలో పలుచోట్ల వరదనీటితో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. .రాజీవ్‌నగర్, నగరిపేట, వినాయక నగర్, సాయినగర్, ఓంశక్తిఎస్టీనగర్, నగరి దళితవాడ, ఆనందకాలనీ, కీలపట్టు బీసీకాలనీ,ఏకాంబరకుప్పం,ప్రకాష్‌నగర్,కేవీఆర్‌పేట,సత్రవాడ, వినాయకనగర్,కీలపట్టు దళితవాడ, పుదుపేట,నత్తం కండ్రిగ ప్రాంతాల్లో వర్షపునీరు నిల్వతో దోమల బెడద ఏర్పడింది. ఈ ప్రాంతాల్లో తక్షణం దోమల నివారణ చర్యలు చేట్టాలని మున్సిపల్ కమీషనర్ కృష్ణారెడ్డిని టీడీపీ నాయకులు కోరారు. కమిషనర్ వెంటనే స్పందించారు పట్టణ టీడీపీ అద్యక్షులు రమేష్‌బాబు, నాయకులు కృష్ణారెడ్డి, గుణశేఖర్, జ్యోతినాయుడు,బబాబురెడ్డి, శ్రీనివాసులు, అశోక్, మురళి,హరిహరన్,తదితర టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

కొండ మల్లీశ్వరుడికి క్షీరాభిషేకం


స్వామి సన్నిధిలో ప్రసన్నానంద మహారాజ్

వెదురుకుప్పం, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): డీఆర్ఎన్‌కండ్రిగ సమీపంలోని అరుణగిరి క్షేత్రంలోని జ్ఞాన ప్రసూనాంబ సమేత కొండ మల్లీశ్వరస్వామికి సోమవారం ఘనంగా క్షీరాభిషేకం చేశారు. ఈ క్రమంలో ప్రత్యేక పూజాది కార్యక్రమాలతో పాటు అభిషేకాలు, అర్చనలు జరిగాయి. శివ, అన్నమయ్య సంకీర్తనలు ఆలపించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం జరిగింది. వేదాంత సొసైటీ ఆఫ్ సాక్రమెంటో ప్రెసిడెంట్ స్వామి ప్రసన్నానంద మహారాజ్ (కాలిఫోర్నియా) పూజలు చేయించారు. రామకృష్ణ మిషన్ ఆశ్రమం (తిరుపతి)కు చెందిన స్వామి సత్యస్థానంద మహారాజ్ కూడా హాజరయ్యారు.

దోహాలో ప్రభుత్వ విప్ థామస్‌కు స్వాగతం



వెదురుకుప్పం, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే డాక్టర్ వీఎం థామస్ సోమవారం ఖతర్ వెళ్లారు. ఈ సందర్భంగా అక్కడి దోహా సిటీ అహ్మద్ ఇంటర్నేషనల్ విమానాశ్రయంలో ఆయనకు కార్వేటినగరం మండలం జాండ్లపేటకు చెందిన ఎన్ఆర్ఐ చంద్రశేఖర్‌నాయుడు, మరికొందరు స్వాగతం పలికారు.

కృష్ణాపురం రిజర్వాయర్‌కు జలకళ


కృష్ణాపురం రిజర్వాయర్ జలకళ


రిజర్వాయర్‌ను పరిశీలిస్తున్న అధికారులు

వెదురుకుప్పం, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం మండలం కృష్ణాపురం రిజర్వాయర్ జలకళ సంతరించుకుంది. తుఫాను కారణంగా వర్షపు నీరు రిజర్వాయర్‌లో చేరడంతో నిండు కుండలా తయారైంది. ఈ రిజర్వాయర్ కింద 6500 ఎకరాల వ్యవసాయ భూములు ఉన్నాయి. ఇక్కడ నీటి నిల్వ ఉండటం వల్ల లోతట్టు ప్రాంతంలో ఉన్న 12 చెరువుల్లో కూడా నీరు చేరుతుంది. ఇప్పటికే నాలుగు చెరువులు నిండిపోయి, కలుజు పారుతున్నాయి. కాగా, సోమవారం నీటి పారుదలశాఖ డీఈ మురళి రిజర్వాయర్‌ను తమ సహచర ఉద్యోగులతో కలసి పరిశీలించారు.

17న పెన్షనర్స్ డే

పుంగనూరు, డిసెంబరు2(ఆంధ్రజ్యోతి): ఈనెల 17వ తేదీ పుంగనూరు విశ్రాంత ఉద్యోగుల సంక్షేమ భవన్‌లో ఘనంగా పెన్షనర్స్ డేను జరపనున్నట్లు సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చెంగారెడ్డి, రామకృష్ణారెడ్డి వెల్లడించారు. సోమవారం స్థానిక విశ్రాంత ఉద్యోగుల భవన్‌లో జరిగిన నెలవారి సమావేశంలో వారు మాట్లాడారు. ప్రభుత్వం వద్ద పెండింగ్‌లో ఉన్న విశ్రాంత ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. సమావేశంలో భరత్‌భూషణ్, కేశవరెడ్డి, సుబ్రహ్మణ్యం, ద్వారకమ్మ, నారాయణరెడ్డి పాల్గొన్నారు.

చెరువులో దూకి ఆత్మహత్య


విజయభాస్కర్ మృతదేహం

చిత్తూరు అర్బన్, డిసెంబర్ 2 (ఆంధ్రజ్యోతి): గంగినేనిచెరువులో దూకి ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. వన్‌టౌన్ సీఐ జయరామయ్య వివరాలమేరకు గిరింపేట రాఘవేంద్ర కాలనీకి చెందిన విజయభాస్కర్ (38) సోమవారం సాయంత్రం గంగినేనిచెరువులో దూకాడు. ఈ సమాచారం తెలుసుకుని పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్నారు. అగ్నిమాపక శాఖ ఏడీఎఫ్‌వో కరుణాకర్ ఆధ్వర్యంలో సిబ్బంది చెరువులో గాలించారు. అప్పటికే విజయభాస్కర్ మృతి చెందాడు. మృతదేహాన్ని వెలికితీశారు.

నేడు ఉడిపి పీఠాధిపతి రాక

చిత్తూరు కల్చరల్, డిసెంబరు2(ఆంధ్రజ్యోతి): నగరంలోని జెండామాను వీధి రాఘవేద్ర స్వామి మఠం బీమారావు సత్రాన్ని ఉడిపి పీఠాధిపతి విశ్వప్రసన్నుల తీర్థులు మంగళవారం సందర్శించనున్నారని మఠం నిర్వహకులు తెలిపారు. మంగళవారం ఆయన రాఘవేంద్రస్వామికి సంస్థాన పూజలు చేశాక భక్తులకు అనుగ్రహ భాషణం చేస్తారన్నారు.

16 నుంచి ధనుర్మాస పాశుర పారాయణాలు

చిత్తూరు కల్చరల్, డిసెంబరు2 (ఆంధ్రజ్యోతి): స్థానిక కోదండరామాలయంలో ఈనెల 16 నుంచి ధనుర్మాసం ప్రారంభం సందర్భంగా గోదాదేవి(అండాళ్)విరచిత తిరుప్పావై పాశురాలు పారాయణం చేయనున్నట్లు ఆలయ అర్చకులు వేణుగోపాల్ తెలిపారు. రోజూ ఉదయం 5 నుంచి 7 గంటల వరకు పాశురం పారాయణం నిర్వహించనున్నట్లు ఈవో సుబ్రమణ్యంనాయుడులు తెలిపారు.

దుప్పట్ల పంపిణీ



నగరి,డిసెంబరు2(ఆంధ్రజ్యోతి):టీఆర్‌కండ్రిగ వద్ద సిరీడ్స్ దివ్యాంగుల పాఠశాలలో విద్యార్థులకు ప్రేరణశ్రీ ఎడ్యుకేషనల్, చారిటబుల్ ట్రస్ట్ సోమవారం నిత్యావసర సరకులను, దుప్పట్లను అందజేసింది. వర్షాకాలంలో విద్యార్థులు చలితో అవస్థలు పడకుండా దుప్పట్లను పంపిణీ చేస్తున్నట్లు దాతలు లక్ష్మీ, ప్రభాకర్‌రెడ్డి తెలిపారు.

త్వరితగతిన రోడ్డు మార్కింగ్ పనులు


పీసీఆర్ పాఠశాల వద్ద మార్కింగ్ చేస్తున్న టౌన్ ప్లానింగ్ సిబ్బంది

చిత్తూరు అర్బన్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థ టౌన్‌ప్లానింగ్ అధికారులు రోడ్డు వెడల్పు పనులను వేగవంతం చేశారు. పది రోజుల క్రితం విజయ డెయిరీ నుంచి పీవీకేఎన్ డిగ్రీ కళాశాల వరకు రోడ్డుకు ఇరువైపులా ఆక్రమణలను తొలగించారు. రెండు రోజుల క్రితం కోర్టు ప్రహరీ గోడకు మార్కింగ్ చేసి వివరాలను జడ్జికి నివేదించారు. సోమవారం ఎస్‌బీఐ, రైల్వే, వక్ఫ్‌బోర్డు, ఎండోమెంటు, పీసీఆర్ కళాశాలలకు చెందిన స్థలాలకు మార్కింగ్ చేశారు. టౌన్‌ప్లానింగ్ ఏసీపీ నాగ్రేంద, టీపీవోలు, పాల్గొన్నారు.

వానకు కూలిన ఆలయం

కుప్పం రూరల్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తమిళనాడు సరిహద్దుల్లో గల దేవరాజపురం ఎస్సీ కాలనీలో గల ముత్తుమారమ్మ ఆలయం ఫెంగల్ తుపాను దెబ్బకు కూలిపోయింది. పైకప్పుతో పాటు కాంక్రీటు స్తంభాలు నేల కూలాయి

వరద నీటితో అన్నదాతల అవస్థలు



బంగారుపాళ్యం మండలంలో నీటమునిగి పొలంలో మొలకెత్తిన వరి- విజయపురం మండలం కాళికాపురంలో నీట మునిగిన వరి

బంగారుపాళ్యం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ ప్రభావంతో వరితో పాటు వాణిజ్య పంటలూ నీట మునిగాయి. ముంగరమడుగు, జంబువారిపల్లె, కురప్పల్లి, దండువారిపల్లె, యర్రాండ్లపల్లి, టేకుమంద, మొగిలి, తుంబకుప్పం, తుంబపాళ్యం, కుప్పాలపల్లి, జిల్లేడుపల్లి గ్రామాలతో పాటు పలు గ్రామాల్లో పంటపొలాలు నీట మునగడంతో రైతులకు అపారనష్టం వాటిల్లింది. కోత దశలో ఉన్న వరి చేతికందే సమయంలో తుఫాన్ వచ్చి తమ కొంపముంచిందని రైతులు వాపోతున్నారు. స్థానిక మార్కెట్ యార్డులో ఆరబోసిన వరి కూడా తడిసి ముద్దయింది. మరోపక్క పశుగ్రాసంలేక స్థానిక మార్కెట్ యార్డు వద్ద కొందరు పాడిరైతులు పశువులను మేపుతున్నారు. నీటమునిగిన పంటలకు ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించి తమను ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

తగ్గని వరద ఉధృతి

విజయపురం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలో వరద నీటి ఉధృతి సోమవారం కూడా కొనసాగింది. పన్నూరు ఆదిఆంధ్రవాడ లోతట్టు ప్రాంతంలో ఇళ్ల చుట్టూ వరదనీరు చేరడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మురికి కాలువలు లేక ఎల్లసముద్రం ఎస్టీ కాలనీలో రోడ్డుపైనే వర్షపునీరు నిలుస్తోందని గ్రామస్తులు వాపోతున్నారు. తెల్లగుంట, కాళికాపురం ప్రాంతాలలో వరదనీరు తగ్గక పోవడంతో పంటలు నీట మునిగాయి.


నిండుకుండలా మంగళం చెరువు

జలమయమైన కార్యాలయాలు

నగరి,డిసెంబరు2(ఆంధ్రజ్యోతి): వర్షాలకు నగరి మండల పరిషత్ కార్యాలయం, పంచాయతీరాజ్, గ్రామీణ నీటిసరఫరా ఇంజనీరింగ్ కార్యాలయాలు జలమయమయ్యాయి. దీంతో సిబ్బంది కూడా కార్యాలయాలకు వెళ్లలేకపోతున్నారు. ప్రభుత్వ కార్యాలయాలే జలమయమైతే మా అవస్థలు ఎవరు పట్టించుకుంటారని పలువురు ఆవేదన వ్యక్తంచేశారు.


నగరిలో జలదిగ్బంధంలో ప్రభుత్వ కార్యాలయాలు

అప్రూవల్ లేని ఇళ్ల నిర్మాణానికి బిల్లుల చెల్లింపు

● హౌసింగ్ అధికారుల నిర్వాకం

పెనుమూరు, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి):పట్టాలేని ఇళ్లకు హౌసింగ్ అధికారులు బిల్లులు మంజూరు చేసిన వైనమిది. పెనుమూరులోని ఎన్టీఆర్ కాలనీలో సర్వే నంబరు 430లో సుమారు 2.50 ఎకరాల ప్రభుత్వ భూమిని అప్పటి వైసీపీ నాయకుల్లో కొందరు కబ్జా చేశారు. స్థానికుల అభ్యతరంతో రెవెన్యూ అధికారులు ఇది ప్రభుత్వ స్థలమంటూ బోర్డులు పెట్టారు. కబ్జాదారులు మాత్రం సెలవుదినాల్లో, రాత్రివేళ నిర్మాణ పనులు చేపట్టారు. ఈ విషయంపై స్థానికులు అప్పటి డిప్యూటీ సీఎంను నిలదీశారు. ఆయన విచారించాలని జేసీని కోరారు. మొత్తం 85 ఇళ్లలో 75 అక్రమంగా కట్టారని రెవెన్యూ అధికారులు తేల్చారు. పనులు ఆపేయాలని జేసీ ఆదేశించారు. వాటికి రెవెన్యూ అధికారులు పట్టాలు ఇవ్వలేదు. పంచాయతీ వారు అప్రూవల్ ఇవ్వలేదు. కానీ హౌసింగ్ అధికారులు మాత్రం బిల్లులు మంజూరు చేయడం విశేషం. లక్షల రూపాయలు ప్రభుత్వ సొమ్మును కబ్జాదారులకు కట్టబెట్టారు. ఇంతవరకు ఎలాంటి చర్యలు లేకపోవడాన్ని స్థానికులు నిరసిస్తున్నారు.

పాళ్యంకొండ భూముల సర్వేకు వినతి


తహసీల్దార్‌కు అర్జీ ఇస్తున్న సభ్యులు

గుడిపాల, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి):రఘునాథపురం సమీపంలోని వెంకటేశ్వరస్వామి పాదాలు, ఆంజనేయస్వామి ఆలయాలకు సంబంధించిన మాన్యం భూములను సర్వే చేసి వివరాలు తెలియజేయాలని కమిటీ సభ్యులు కోరారు. సోమవారం తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డిని కమిటీ అధ్యక్షుడు గుర్రప్పనాయుడు, కోటిలు కలిశారు. వారు మాట్లాడుతూ పాళ్యంకొండలో మాన్యం భూముల వివరాలు సర్వే నెంబర్లతో సహా ఇవ్వాలని కోరారు. ఆక్రమించుకున్న వారికి సంబంధించిన సమాచారం ఉంటే తహసీల్దార్‌కు లేదా కమిటీ సభ్యుల దృష్టికి తీసుకురావాలని కోరారు. మండల టీడీపీ అధ్యక్షులు సుబ్రహ్మణ్యం నాయుడు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నిండిన చెరువులు : అన్నదాతల ఆనందం


పారుతున్న కలుజు

పాలసముద్రం,డిసెంబరు(ఆంధ్రజ్యోతి): తుఫాన్ ప్రభావంతో మండలంలోని పలు గ్రామాల చెరువులు నిండి కలుజు పారుతోంది. 19 చెరువులకు గాను తొమ్మిది చెరువులు నిండాయి. పాలసముద్రం,శ్రీకావేరిరాజుపురం, కృష్ణజిమ్మాపురం,వెంగళరాజుకుప్పం, నరసింహాపురం పంచాయతీల్లోని చెరువులు పూర్తిగా నిండి కలుజు పారుతోంది. మిగిలిన పంచాయతీలలో ఉన్న చెరువులు సంగం కంటే ఎక్కువగా నిండాయి. చెరువులకు నిండటంతో అన్నదాతలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

రెండు రోజుల్లో కారుణ్య నియామకాలు

● జడ్పీ సీఈవో రవికుమార్ నాయుడు


జడ్పీ సీఈవోతో చర్చించిస్తున్న ఎస్టీయూ నాయకులు

చిత్తూరు రూరల్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో అకాల మరణం చెందిన ఉద్యోగ, ఉపాధ్యాయుల కుటుంబ సభ్యులకు రెండు రోజుల్లో కారుణ్య నియామకాల ప్రక్రియ ద్వారా ఉద్యోగ అవకాశం కల్పిస్తామని జడ్పీ సీఈవో రవికుమార్ నాయుడు తెలిపారు. సోమవారం మధ్యాహ్నం ఎస్టీయూ నాయకులు జడ్పీ సీఈవోను కలిసి వివిధ అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు గంటా మోహన్ మాట్లాడుతూ కారుణ్య నియామకాల్లో జాప్యం వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు హేమచంద్రారెడ్డి, జిల్లా అధ్యక్షుడు మదన్ మోహన్‌రెడ్డి, నాయకులు సర్దార్, చిట్టిబాబు, గుణశేఖర్, లక్ష్మీపతి, గణపతి, మధు, ఉమాపతి, ఢిల్లీబాబు, అమర్ పాల్గొన్నారు.

వర్ష బాధిత ప్రాంతాల్లో ఎంపీడీవో పరిశీలన


విజయమాంబాపురం ఎస్టీ కాలనీలో వివరాలు తెలుసుకుంటున్న ఎంపీడీవో

వెదురుకుప్పం, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం మండలం విజయమాంబాపురం ఎస్టీకాలనీలో సోమవారం ఎంపీడీవో చంద్రమౌళి పర్యటించారు. నీటి నిల్వల తొలగింపునకు చర్యలు చేపడతామని ఆయన హామీ ఇచ్చారు. గాజంకి ప్రాంతంలో మూడు ఎకరాల్లో వరి పంటకు నష్టం వాటిల్లిందని ఏవో హేమలత తెలిపారు.వెదురుకుప్పం మండలంలో 178 చెరువులున్నాయి. ఇందులో సుమారు 50 చెరువుల్లో కలుజు పారుతోంది. చెరువులు జలకళ సంతరించుకున్నాయి.

కొనసాగుతున్న స్మార్ట్ డోర్‌లాక్‌ల పంపిణీ


స్మార్ట్‌డోర్‌లాక్స్ పంపిణీ చేస్తున్న సీఐ నెట్టికంఠయ్య

చిత్తూరు అర్బన్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): నగరంలో స్మార్ట్‌డోర్ లాక్స్ పంపిణీ కార్యక్రమం సోమవారం కూడా నిర్వహించారు. ఇళ్లలో దొంగతనాలను అరికట్టడానికి తక్కువ ధరలకు పోలీసు శాఖ వీటిని పంపిణీ చేస్తున్న సంగతి తెలిసిందే. ఆలయాల నిర్వాహకులు, చర్చిల ఫాదర్లు, ముస్లీం పెద్దలతో పాటు వ్యక్తిగతంగా వచ్చిన వారికి కూడా వీటిని అందజేశారు. కార్యక్రమంలో సీఐ నెట్టికంఠయ్య, ఎస్ఐ ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

ఒకరికి తీవ్ర గాయాలు

గుడిపాల, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు-వేలూరు జాతీయ రహదారిలో నరహరిపేట క్రాస్ వద్ద సోమవారం రాత్రి ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. ఇంద్రానగర్ చెందిన రవి నరహరిపేట క్రాస్ వద్ద తీవ్రగాయాలతో పడి ఉన్నాడు. గమనించిన స్థానికులు వెంటనే అంబులెన్స్‌లో చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు, పరిస్థితి విషమంగా ఉంది. గుర్తు తెలియని వాహనం ఢీకొని వెళ్లిందా, లేక అతనే ద్విచక్ర వాహనం నుంచి పడిపోయాడా తెలియాల్సి ఉంది, ఎస్సై రామ్మోహన్ దర్యాప్తు చేస్తున్నారు.

వృద్ధులకు అన్నదానం

వెదురుకుప్పం, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): కార్వేటినగరంలోని వృద్ధాశ్రమంలోని వృద్ధులకు సోమవారం తిరుపతి పట్టణంలోని చెన్నారెడ్డి కాలనీకి చెందిన బాలబారతి, ఈశ్వర్ దంపతుల వితరణతో అన్నదానం చేశారు. స్వీట్లు, పండ్లు ఇచ్చారు.

అదనపు గదుల్లేక విద్యార్థుల ఇబ్బందులు

● కోతుల దాడితో భయపడుతున్న తల్లిదండ్రులు

● బీరప్పచెరువు ఎంపీయూపీ పాఠశాలలో ఇదీ పరిస్థితి


అసంపూర్తిగా ఉన్న భవనంలో పాఠాలు చెబుతున్న ఉపాధ్యాయుడు

ఐరాల, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఐరాల మండలం బీరప్పచెరువు ఎంపీయూపీ పాఠశాలలో అదనపు గదులు లేక విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. మండల కేంద్రానికి సుమారు ఐదు కిలో మీటర్ల దూరంలో ఈ పాఠశాల ఉంది. ఐరాలతోపాటు పరిసర ప్రాంతాల నుంచి ఈ బడికి 150 మందికిపైగా విద్యార్థులు వస్తున్నారు. పాత భవనం చాలక పోవడంతో గత ప్రభుత్వం నూతన భవన నిర్మాణానికి అనుమతి మంజూరు చేసింది. కాంట్రాక్టర్‌కు బిల్లులు రాకపోవడంతో ఆ నిర్మాణాన్ని సగంలోనే ఆపేశారు. ఈ అసంపూర్తి భవనం, పాఠశాల వరండాలోనే విద్యార్థులకు ఉపాధ్యాయులు పాఠాలు చెబుతున్నారు. మధ్యాహ్న సమయంలో భోజనం చేయడానికి వెళ్లి వచ్చేలోపు చెట్లపై ఉండే కోతులొచ్చి విద్యార్థుల బ్యాగులు, పుస్తకాలు ఎత్తుకెళుతున్నాయి. అప్పుడప్పుడు విద్యార్థులపైనా దాడి చేస్తున్నాయి. దీంతో తమ పిల్లలను పాఠశాలకు పంపడానికి తల్లిదండ్రులు భయపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అసంపూర్తిగా ఉన్న భవనాన్ని త్వరగా పూర్తిచేయాలని వారు వేడుకుంటున్నారు.

కోతులు దాడి చేయకుండా చూసుకుంటున్నాం



విద్యార్థులపై కోతులు దాడి చేయకుండా ఉపాధ్యాయులందరం కలసి చూసుకుంటున్నాం. అసంపూర్తిగా ఉన్న పాఠశాల భవన నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేస్తే సమస్య పరిష్కారమవుతుంది. -హెచ్ఎం ఉషారాణి

పెచ్చులూడుతున్న పైకప్పు

●కార్యాలయ సిబ్బంది ఆందోళన


ఎంపీడీవో కార్యాలయంలో పైకప్పు దుస్థితి

పాలసముద్రం,డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): ఎంపీడీవో కార్యాలయం భవనం పైకప్పు పెచ్చులూడి కింద పడుతోంది. 30 సంవత్సరాల క్రితం ఈ కార్యాలయాన్ని నిర్మించారు. ఏళ్లు గడుస్తుండటంతో మోల్డింగ్ పటుత్వం కోల్పోయి పెచ్చులూడి కింద పడుతోంది. మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పైకప్పు ఉరుస్తోంది. పెచ్చులూడుతుండటంతో కార్యాలయ సిబ్బంది ఆందోళన చెందుతున్నారు. భవనానికి మరమ్మతుల చేపట్టాలని సిబ్బంది కోరుతున్నారు.